

# విజయభాను

విజయవాడ, శుక్రవారం 28-07-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 55 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కలలు కనండి
# కలాంను స్ఫూర్తిగా తీసుకోండి

- ఘనంగా కలాం రెండో వర్ధంతి
- కలాం మెమోరియల్ ప్రారంభం...
- మాట నిలబెట్టుకున్న మోదీ..
- యువత ఉద్యోగ రూపకర్తలుగా మారాలి
- రామేశ్వరం- ఫైజాబాద్ రైలు ప్రారంభం



చెన్నై: రామేశ్వరంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన మాజీరాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రారంభించారు. కలాం రెండో వర్ధంతి సందర్భంగా ప్రధాని మోదీ గురువారం తమిళనాడులోని రామేశ్వరం వచ్చారు. తంగచ్చిమఠం ప్రాంతంలో కలాం సమాధివద్ద కేంద్ర ప్రభుత్వం నిర్మించిన స్మారక మండపాన్ని ప్రారంభించారు. అనంతరం మండపంలోని కలాం విగ్రహాన్ని ప్రతిష్టించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడికి వచ్చిన అబ్దుల్ కలాం కుటుంబ సభ్యులను కలుసుకుని కొద్దిసేపు ముచ్చటించారు. ఈ మండపంలో సుమారు 700 కలాం ఛాయాచిత్రాలు, ఆయన సేవలపై గీసిన చిత్ర లేఖనాలను మోదీ వీక్షించారు. ప్రధానితో పాటు తమిళనాడు ఇంచార్జ్ గవర్నర్ విద్యాసాగర్ రావు, ముఖ్యమంత్రి పళని స్వామి, ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడు సహా పలువురు ప్రముఖులు కూడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

2015 జూలై 27న డాక్టర్ అబ్దుల్ కలాం షిల్లాంగ్‌లో ఉండగా గుండెపోటు గురై మృతిచెందిన సంగతి తెలిసిందే. కలాం కోరిక మేరకు ఆయన జన్మస్థలమైన రామేశ్వరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

2015 అక్టోబర్‌లో కలాం 84 జయంతి సందర్భంగా ప్రధాని మోదీ నివాళులర్పిస్తూ.. రామేశ్వరంలో కలాం స్మారక మండపం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. శాస్త్రవేత్తగా, రాష్ట్ర పతిగా దేశానికి ఎనలేని సేవలు అందించిన అబ్దుల్ కలాం నుంచి భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందేలా మెమోరియల్ తీర్చిదిద్దుతామన్నారు..



అమృత్ పథకంలో భాగంగా రామేశ్వ రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తాజాగా ఆయన అన్నట్టే రూ.15 కోట్ల వ్యయంతో

తరువాయి 2లో

## దేశం గర్వించేలా మరిన్ని
# పతకాలు సాధించాలి

- గ్రూప్-1 ఆఫీసర్‌గా సింధు నియామకం
- సీఎం చేతులమీదుగా నియామకపత్రాల అందజేత



రియో ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచిన పి.వి.సింధు గ్రూప్-1 ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియామక పత్రాన్ని గురువారం పి.వి.సింధుకి అందజేశారు. దేశం గర్వించేలా మరిన్ని పతకాలు సింధు సాధించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

గత ఏడాది ముగిసిన రియో ఒలింపిక్స్‌లో ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన సింధు ఫైనల్‌కి చేరింది. అక్కడ కరోలినా మారిన్ చేతిలో ఓడినా.. బ్యాడ్మింటన్‌లో రజతం గెలిచిన ఏకైక క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ఒలింపిక్స్‌లో సింధు పోరాట పటిమకి మెచ్చిన చంద్రబాబు నాయుడు అప్పట్లో సింధుకి గ్రూప్-1 ఆఫీసర్ ఉద్యోగాన్ని ప్రకటించారు. తాజాగా దానికి సంబంధించిన నియామక పత్రాన్ని ఆమెకి స్వయంగా అందజేశారు.

## వారం రోజులపాటు
# ముద్రగడ హౌస్‌అరెస్ట్



- పాదయాత్రకు అనుమతి లేదు
- హౌస్ అరెస్టు బదులు జైల్లో పెట్టండి: ముద్రగడ
- ప్రభుత్వ ఆదేశాల మేరకే హౌస్ అరెస్టు: ఎస్పీ విశాల్‌గున్నీ

కిర్లంపూడి: కాపుల రిజర్వేషన్ల కోసం పాదయాత్ర చేపట్ట తలపెట్టిన ఆ సామాజిక వర్గ ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను వారం రోజులపాటు గృహనిర్బంధం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పద్మనాభంను కిర్లంపూడిలోని తన ఇంటి

తరువాయి 2లో



## ముగిసిన
# ముమైత్ విచారణ

హైదరాబాద్: మాదకద్రవ్యాల కేసులో సినీనటి ముమైత్‌ఖాన్‌ను ఆబ్కారీ శాఖ సిట్ విచారించింది. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ విచారణ ముగిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు నలుగురు మహిళా అధికారులతో ఏర్పాటు చేసిన విచారణ బృందం ఆమెను సుమారు ఆరు గంటలపాటు విచారించింది. ఛార్మి కౌర్‌ను విచారించినట్టుగానే ముమైత్‌ఖాన్

తరువాయి 2లో

## బీహార్ సీఎంగా నితీశ్ కుమార్
# ఆరవసారి ప్రమాణం



పాట్నా: షాక్ నుంచి ఆర్జేడీ కోలుకునేలోపే బీహార్ పీఠంపై మళ్లీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు నితీశ్ కుమార్. లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీకి బ్రేకప్ చెప్పిన నితీశ్ కుమార్ 24 గంటల్లోపే తన పీఠాన్ని సుస్థిరం

తరువాయి 2లో

# మొక్కలు నాటడమే కాదు.. సంరక్షించాలి

## ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాద రావు

నరసరావుపేటః వనం-మనం కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట నియోజకవర్గం పరిధిలో మూడున్నర లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలు, నాయకులు, అధికారులు, విద్యార్థులకు ఏపి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అభినం దనలు తెలిపారు.

గురువారం నరసరావుపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని



పిలుపునిచ్చారు. కోటప్పకొండ ప్రాంతంలో మొక్కలు సంరక్షణ

తరువాయి 2లో






## టేకిట్ ఈజీ



పబ్ కల్చర్..
బార్ కల్చర్... పోతేగానీ
మన కల్చర్ బాగు పడదోయ్ !!

# పై డేటా సెంటర్‌తో నిరుద్యోగ యువతకు అవకాశాలు మెండు

## ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి .. పరిశీలించిన కలెక్టర్ కోన శశిధర్



అమరావతిః నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరిలో పై డేటా సెంటర్‌ను ఈ నెల 28న ఉదయం 10 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ మీడియాకు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి చేయవలసిన, చేస్తున్న ఏర్పాట్లను గురువారం గుంటూరు అర్బన్ ఎస్.పి. ఎస్. విజయారావుతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల విషయమై సెంటర్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ముప్పనేని కళ్యాణ్‌తో చర్చించారు. ముఖ్యమంత్రి ప్రవేశించే ప్రాంతం, సెంటర్ ప్రారంభోత్సవం, సిబ్బంది వుండే గదులను, జిమ్, కేఫ్టేరియా, తదితర

తరువాయి 2లో

# నాటు తుపాకీతో కాల్పులు

బెంగళూరు : ఉపాధి జాబ్ కార్డు చేయించుకునేందుకు వచ్చిన కృష్ణ (32) అనే వ్యక్తిపై సిద్ధరాజు అనే వ్యక్తి నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. కడుపులోకి బుల్లెట్ దూసుకు పోయి తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం మైసూరు లోని జె.ఎస్.ఎస్. వైద్యాలయంలో చేర్పించారు. పోలీసుల కథనం మేరకు.. చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూక కురహట్టిలో అధికారుల నుంచి జాబ్ కార్డును చేయించుకునేందుకు కృష్ణ వచ్చాడు. అదే గ్రామానికి చెందిన సిద్ధరాజుకు మొదటి నుంచి కృష్ణతో వైరం ఉంది. అతన్ని లక్ష్యంగా చేసుకుని, గొడవకు దిగిన సిద్ధరాజు అనంతరం నాటు తుపాకీతో కాల్చి పరారయ్యాడు.

## బసవనబాగేవాడిలో బస్సులోనే కాన్పు

బెంగళూరు : విజయపుర జిల్లా బసవనబాగేవాడిలో ఆర్టీసీ బస్సులో వెళుతున్న లక్ష్మి రాథోడ్ అనే నిండు గర్భిణి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మహారాష్ట్రకు చెందిన లక్ష్మి విజయపుర మార్గంలో బాగలకోటకు వెళుతున్న సమయంలో నొప్పులు వచ్చాయి. బస్సు డ్రై%వరు విఠల హరకల్ తక్షణమే స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి ఫోన్‌లో సమాచారం అందించారు. బస్సు ఆరోగ్య కేంద్రానికి చేరుకునేలోగా ఆమెకు నొప్పులు ఎక్కువ కావటంతో బస్సును ఒక పక్కకు నిలిపారు. మహిళా ప్రయాణికులు ఆమెకు పురుడు పోశారు. అనంతరం తల్లీ బిడ్డను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ ఎస్.ఎం.పాటిల్ తెలిపారు.

# కోలుకుంటున్న జాజ్‌పూర్, భద్రక్ జిల్లాలు




భువనేశ్వర్ : జాజ్‌పూర్ జిల్లాలో వైతరణి నదిలో నీటి మట్టం తగ్గడంతో ఆ ప్రాంతంలో వరద సమస్య మెరుగుపడింది. గ్రామాలలోకి చేరిన నీరు తగ్గింది. వరద సహాయక కేంద్రాల్లో ఉన్నవారు తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. గ్రామాలు బురదమయంగా ఉండడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. జాజ్‌పూర్ జిల్లాలో దశరథపూర్, కొరాయి, జాజ్‌పూర్ సమితులకు చెందిన 15కుపైగా పంచాయతీలు వరదల్లో చిక్కుకున్న సంగతి విదితమే. భద్రక్ జిల్లాలో వైతరణి ఉపనదుల్లో వరదలు రావడంతో భ%ద్రక్ జిల్లాలో 8 పంచాయతీలకు చెందిన 50కి పైగా గ్రామాలకు వరదలు వచ్చాయి. వైతరణి నదిలో నీటి మట్టం ప్రమాద స్థాయికి దిగువకు చేరుకోవడంతో ఉపనదుల్లో కూడా ప్రవాహం తగ్గింది.

# విద్యుత్తు వినియోగదారులకు న్యాయం ఎండమావేనా?

రాయచూరు : విద్యుత్తు వినియోగదారుల చట్టం-2003 ప్రకారం స్థాపించిన విద్యుత్తు వినియోగదారుల సమస్యల నివారణ వేదిక ద్వారా జెస్కాం పరిధిలోని వినియోగదారులకు న్యాయం జరగడం లేదని ఫస్ట్ యాక్షన్ సోషల్ టీమ్ అధ్యక్షుడు, న్యాయవాది శరత్‌కుమార్ కళస ఆరోపించారు. ఈ మేరకు ఆయన భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వేదికకు ఎస్.ఈ. అధ్యక్షుడిగా, ఈ.ఈ. సభ్యుడిగా, కర్ణాటక విద్యుత్తు నియంత్రణ కమిషన్ ప్రతిపాదిత (నామినేటెడ్) సభ్యుడిగా ఒకరు ఉంటారని వివరించారు. ఈ వేదికకు వచ్చిన ఫిర్యాదులను 60 రోజుల్లో పరిష్కరించాలని, 15 రోజులకోసారి సమావేశం కావాలని నిబంధన ఉందన్నారు. వేదికలో ఏ ఒక్కరు గైర్హాజరైనా మరో సభ్యుడితో సమావేశం నిర్వహించి ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉందన్నారు. అయితే జెస్కాం ఎస్.ఈ.కృష్ణప్ప అన్ని నియమాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ఐదారు నెలలు అయినా ఫిర్యాదులను విచారించడం లేదని, ఎప్పుడో ఒకసారి సమావేశమైనా గదిలో రహస్యంగా విచారిస్తూ ఫిర్యాదుదారును బెదిరించేలా మాట్లాడుతున్నారని తెలిపారు. వినియోగదారుడి తరపున మాట్లాడాల్సిన విద్యుత్తు నియంత్రణ కమిషన్ సభ్యుడు రామచంద్రప్రభు మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. జిల్లాలో 15 నుంచి 20 ఏళ్లుగా నడుస్తున్న కేసులు 25 వరకు ఉండటం విచారకరమన్నారు. వినియోగదారుకు న్యాయం చేయనందున ఎస్.ఈ.ని బదిలీ చేయాలని, రామచంద్ర ప్రభు సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

# పర్యాటక రంగానికి ప్రాధాన్యం

## ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



బ్రహ్మపుర : రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. గంజాం జిల్లా కళ్లికోట సమితి ఒడియా ఒళాపూర్‌కు సమీపాన కొత్తగా నిర్మితమైన స్వస్తి చిలికా రిసార్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. అంతకుముందు ఉదయం 11.15 గంటలకు హెలీకాప్టరులో గంజాం జిల్లాకు చేరుకున్న ఆయన వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవాలు, భూమిపూజలు జరిపారు. కళ్లికోట సమితిలో పాథర(కందరపడా) వద్ద ఓడీఆర్పీ కింద రూ.14.30 కోట్లతో నిర్మాణమైన 37 గ్రామీణ రహదారులను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. కనకా వద్ద రూ.1.33 కోట్లు, పనానువాగాం వద్ద రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మించిన బహుముఖి తుపాను ఆశ్రయ కేంద్రాలను ఆయన శుభారంభం చేశారు. అలాగే కళ్లికోట సమితిలో ఓడీఆర్పీ కింద రూ.2.48 కోట్ల వ్యయంతో నిర్మాణం కానున్న సామాజిక కేంద్రం, పాథర ఏఎన్ఎం కేంద్రం, సబుళియా-3 సామాజిక కేంద్రం, సబుళియా-1 ప్రాథమిక పాఠశాల భవనం, గురపల్లిలో సామాజిక కేంద్రం తదితరాలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు సూర్యనారాయణ పాత్ర్, అశోక్‌చంద్ర పండా, ఉషాదేవి, జిల్లా శాసనసభ్యులు వి.సుజ్ఞానకుమారి దేవ్, శ్రీకాంత్ సాహు తదితరులు పాల్గొన్నారు. గంజాం జిల్లా పాలనాధికారి ప్రేమ్‌చంద్ర చౌధరి, గంజాం ఎస్పీ ఆశీష్ కుమార్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# సహకార ఖాతాదారులకు త్వరలో డెబిట్ కార్డులు

## ముఖ్యమంత్రి పళనిస్వామి




చెన్నై : తమిళనాడులోని సహకార బ్యాంకు ఖాతాదారులు అందరికీ త్వరలో రూపే డెబిట్ కార్డులు అందించనున్నట్టు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. నాబార్డు 36వ వార్షికోత్సవం, స్వయం సహాయక బృందాలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాలు నగరంలో జరిగాయి. ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తమిళనాడులో వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రైతుల ప్రగతి, గ్రామీణ మహిళల జీవితాల వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో నాబార్డు అందిస్తున్న సేవలు కూడా ప్రధానమైనవని కొనియాడారు. గ్రామీణ రోడ్లు మొదలు పాఠశాలలు, పశు వైద్యశాలలు, ఫిషింగ్ హార్బరు, వ్యవసాయ సహకార సంఘాలు, పౌర వినియోగ గోదాములు వంటి పలు పథకాలకు నాబార్డు నిధులు అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి ఏడాదికి రూ.2 వేల కోట్ల వరకు రుణాలు అందిస్తోందని చెప్పారు. గ్రామీణాభివృద్ధి పథకంలో ఎక్కువ నిధులు పొందే రాష్ట్రాల్లో తమిళనాడు అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా వ్యవసాయ, పశువె%ద్య, ఫిషరీస్ తదితర విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం లభించిందని చెప్పారు. విద్య, వ్యవసాయ సంబంధిత పరిశోధనలు, పారిశ్రామికాభివృద్ధికి నాబార్డు మార్గం సుగమం చేసిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన నీరా ఉత్పత్తి పథకానికి పరిశ్రమల స్థాపనకు కూడా నాబార్డు సహకరించాలని కోరారు. సహకార బ్యాంకుల నిర్వహణ, రూపే డెబిట్ కార్డుల అందజేత, ఏటీఎం యంత్రాల ఏర్పాటుకు రాయితీ ఇచ్చి సహకారం అందించిందని తెలిపారు. జూన్ 12న జరిగిన కార్యక్రమంలో 40 ఏటీఎం యంత్రాలు ప్రారంభించి, రూపే డెబిట్ కార్డులను ఖాతాదారులకు అందించినట్టు గుర్తుచేశారు. తమిళనాడులోని 8 లక్షల సహకార బ్యాంకు ఖాతాదారులకు త్వరలో రూపే డెబిట్ కార్డులు అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డుకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించాలి

- జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి

- ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ఆదిలాబాద్ : చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించేలా విద్యార్థులు ప్రణాళికలు వేసుకోవాలని జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి అన్నారు. ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేశారు. ఇంటర్‌లోని ప్రతి గ్రూపు నుంచి ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులను ఎంపిక చేసి జిల్లావ్యాప్తంగా 64మందికి ఈ పురస్కారాలు ప్రదానం చేశారు.

జ్ఞాపికతో పాటు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలనాధికారి విద్యార్థులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని పేర్కొన్నారు. కళాశాలల అభివృద్ధిపై విద్యార్థులు, ప్రధానాచార్యులతో పాటు తల్లిదండ్రులు సైతం భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని చెప్పారు. విద్యార్థులకు ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు శిక్షణ ఇవ్వాలని ఈ కార్యక్రమానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందించే విషయమై అధికారులతో చర్చిస్తామని వివరించారు.

కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక విద్యాధికారి బి.నాగేందర్, ప్రభుత్వ ప్రధానాచార్యుల సంఘం నేతలు గణేష్‌జాదవ్, గులాం ఖురాని, ప్రధానాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వారం రోజులపాటు ముద్రగడ హౌస్‌అరెస్ట్

నుంచి బయటకు కదలనిచ్చేది లేదని పోలీసు అధికారులు ఆయనకు తెలిపారు. ఛలో అమరావతి పేరిట బుధవారం పద్మనాభం పాదయాత్ర తలపెట్టారు. అయితే ఆయన పాదయాత్రకు అనుమతి లేదని పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. తొలుత 24గంటలపాటు హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు.. దాన్ని వారం రోజులకు పొడగించారు. దీంతో కిర్లంపూడిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాపు ఉద్యమనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కిర్లంపూడి చేరుకుంటున్నారు. దీంతో ముందుజాగ్రత్తగా కిర్లంపూడిలో భద్రతా దళాలు భారీగా మోహరించాయి.

తనను వారం రోజుల పాటు హౌజ్ అరెస్ట్ చేయడంతో ముద్రగడం పోలీసులు, ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి ఇంట్లో నిర్బంధించే బదులు తనను జైల్లో పెట్టాలని ఆయన మండిపడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాలనే తాము అమలు చేస్తున్నామని పోలీసులు చెప్పడంతో ముద్రగడ తన అనుచరులతో ఇంట్లోకి వెళ్లిపోయారు.

## కలలు కనండి.. కలాంను స్ఫూర్తిగా తీసుకోండి

కలాం స్మారక మండపం అద్భుతంగా సిద్ధ మైంది. రామేశ్వరానికి కొత్తకళ వచ్చింది.

రామేశ్వరం- ఫైజాబాద్ రైలు ప్రారంభం

తమిళనాడులోని రామేశ్వరం నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫైజాబాద్ (వయా అయోధ్య) వరకు నడిచే వారపు ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. రామేశ్వరంలోని పవిత్రమైన మట్టిని తాకినందుకు ఎంతో గర్వంగా ఉంది. ఈ పవిత్ర భూమి భారతీయ ప్రముఖుల్లో ఒకరైన డా.ఏపీజే అబ్దుల్ కలాంను దేశానికి ఇచ్చింది అని కొనియాడారు. కలాం ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుత యువత ఉద్యోగ రూపకర్తలుగా మారాలని అనుకుంటున్నారు అని మోదీ కొనియాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం స్మారక మండపాన్ని నిర్మించేందుకు ఎంతో కృషి చేసిన కార్మికులకు అందరూ లేచి నిలబడి కృతజ్ఞతలు తెలియజేయాలని సభకు విచ్చేసిన వారిని కోరారు. ఇటువంటి సమయంలో జయలలితను ఎంతో మిస్ అవుతున్నాం. కానీ ఆమె దీవెనలు మాత్రం ఎప్పటికీ ఉంటాయి. ఆమె ఇక్కడ ఉండి ఉంటే ఎంతో సంతోషించేవారు. ఆమె ఓ గొప్ప నేత.. ప్రతి ఒక్కరూ అమ్మను స్మరించుకోవాలి అని మోదీ అన్నారు.

తెలుగు రాష్ట్రాల మీదుగా అయోధ్య రైలు

రామేశ్వరం-ఫైజాబాద్(వయా అయోధ్య) రైలు తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణించనుంది. ఈ రైలు (నెం.16793/16794) ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు, విజయవాడ, తెలంగాణలోని వరంగల్ స్టేషన్లలో ఆగనుంది. రామేశ్వరంలో ప్రతి ఆదివారం రాత్రి 11.50కి ఫైజాబాద్‌లో ప్రతి బుధవారం రాత్రి 11.55 గంటలకు బయలుదేరుతుంది.

## బీహార్ సీఎంగా నితీశ్ కుమార్ ఆరవసారి ప్రమాణం

చేసుకున్నారు. బీజేపీ ఎమ్మెల్యేల మద్దతుతో మళ్లీ సీఎం అయ్యారు. ఇవాళ ఉదయం 10 గంటలకు నితీశ్ కుమార్ బీహార్ సీఎంగా ఆరవ సారి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నితీశ్‌తో గవర్నర్ కేశరినాథ్ త్రిపాఠి ప్రమాణ స్వీకారం చేయించారు. బీజేపీకి చెందిన సుశీల్ మోడీ డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. ఐఆర్‌సీటీసీ కేసు మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ మెడకు చుట్టుకోవడంతో జేడీయూ ఆ సంకట స్థితి నుంచి తప్పించుకునేందుకు శతవిధాలా ప్రయత్నించింది. చివరకు జేడీయూ చీఫ్ నితీశ్ ఆర్జేడీకి గుడ్‌బై చెప్పడంతో బీహార్‌లో పొలిటికల్ డ్రామా ఆసక్తికరంగా మారింది. అయితే రాత్రికి రాత్రే పరిమాణాలు శరవేగంగా మారాయి. బీజేపీతో జత కట్టిన జేడీయూ మళ్లీ రాష్ట్రపాలనను చేజిక్కించుకున్నది.

సర్కారు నడుపలేను - నితీశ్

జేడీయూ శాసనసభా పక్షం సమావేశం నుంచి నితీశ్ నేరుగా రాజభవన్‌కు వెళ్లి రాజీనామా సమర్పించారు. ప్రస్తుతం బీహార్‌లో ఉన్న పరిస్థితుల ద ృష్ట్యా మహాకూటమి ప్రభుత్వాన్ని నడుపడం కష్టమైపోయింది అని సీఎం నితీశ్ అన్నారు. గవర్నర్ త్రిపాఠీకి రాజీనామా సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నేను సర్దుబాటుకు ప్రయత్నించాను. తేజస్విపై వచ్చిన బినామీ ఆరోపణలను నేనెలా సమర్థిస్తాను? తనను ఇరికించేందుకు ఏదైనా కుట్ర జరిగిందా? అని అడిగాను. ఆయనగానీ, లాలూగానీ సమాధానం ఇవ్వలేదు. నాకు రాజీనామా చేయడం తప్ప మరో గత్యంతరం లేకపోయింది అని వివరించారు. గవర్నర్ తన రాజీనామాను ఆమోదించారని, తదుపరి ప్రభుత్వం ఏర్పడేంత వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగమన్నారని చెప్పారు. బీజేపీ మద్దతుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమివ్వకుండా దాటవేశారు. బీహార్ ప్రయోజనాల కోసం ఏది చేయాలో అది చేస్తాను.. తదుపరి ఏం జరుగుతుందో వేచిచూడండి అని చెప్పారు.

## ముగిసిన ముమైత్ విచారణ

విచారణను కూడా సాయంత్రం 5 గంటలలోపే అధికారులు ముగించారు. ప్రస్తుతం ఓ తెలుగు ఛానల్ నిర్వహిస్తోన్న రియాలిటీ షోలో ఉన్న ముమైత్‌ఖాన్ సిట్ ఎదుట హాజరయ్యేందుకు బుధవారం రాత్రి పుణె నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ ఓ హోటల్‌లో బసచేశారు. అనంతరం గురువారం ఉదయం నాంపల్లిలోని సిట్ కార్యాలయానికి చేరుకున్న ఆమెను నేరుగా ఐదో అంతస్థులోకి తీసుకెళ్లి విచారించారు. ఈ విచారణలో ప్రధానంగా డ్రగ్స్ ముఠా నాయకుడు కెల్విన్‌తో ఆమెకు ఉన్న పరిచయాలపైనే ఆరా తీసినట్టు తెలుస్తోంది. అతడి సెల్‌ఫోన్‌లో ముమైత్‌ఖాన్ ఫోన్ నంబర్ ఉండటంతో పాటు వీరిద్దరి మధ్య వాట్సాప్ చాటింగ్ వివరాలకు సంబంధించిన అంశాలను సైతం అధికారులు సేకరించినట్టు సమాచారం. గతంలో విచారించిన వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన ప్రశ్నల జాబితా ఆధారంగా ఆమెను సుమారు ఆరు గంటలపాటు విచారించారు. డ్రగ్స్‌తో సినీ పరిశ్రమకు ఉన్న సంబంధాలు, కెల్విన్ ఎవరెవరికి సరఫరా చేశాడు? డ్రగ్స్‌ను ఎవరు సమకూరుస్తారు, అసలు ముమైత్ ఖాన్‌కు డ్రగ్స్ వాడే అలవాటు ఉందా? ఒకవేళ ఉంటే ఎలా అలవాటైంది? తదితర ప్రశ్నలను సంధించి ఆమె నుంచి కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది.

శాంపిల్స్ ఇస్తానన్నా వద్దన్నారు!

ఈ విచారణలో భాగంగా ఆమె నుంచి అధికారులు ఎలాంటి శాంపిల్స్ సేకరించలేదని సమాచారం. రక్తం గోళ్లు, వెంట్రుకల నమూనాలు ఇచ్చేందుకు ముమైత్ ఖాన్ సిద్ధపడ్డారనీ, ప్రస్తుతం అవసరంలేదని తాము చెప్పినట్టు సిట్ అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాలు వాడారా? లేదా' అనేది శాస్త్రీయంగా నిర్ధారించేందుకు ఇప్పటికే ఇద్దరి నుంచి అధికారులు శాంపిల్స్‌ను తీసుకున్న విషయం తెలిసిందే. గురువారం ముమైత్ ఖాన్‌తో పాటు డ్రగ్స్ కేసులో మరో ఇద్దరిని కూడా విచారించినట్టు సిట్ ఓ ప్రకటన జారీ చేసింది.

నేడు సిట్ ముందుకు రవితేజ ..

ఈ కేసులో సినీ హీరో రవితేజ విచారణకు హాజరు కానున్నారు. అయితే, ముమైత్‌ఖాన్ నుంచి సేకరించిన మొత్తం సమాచారం క్రోడీకరించి.. అవసరమనుకుంటే మరోసారి విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని అధికారులు ఆమెకు చెప్పినట్టు తెలుస్తోంది.

## మొక్కలు నాటడమే కాదు.. సంరక్షించాలి

బాధ్యత అటవీశాఖ అధికారులు, నరసరావుపేట పట్టణంలోని మొక్కల సంరక్షణ బాధ్యత మున్సిపాలిటీ చూస్తుందన్నారు. ఇక గ్రామాల్లో నరేగా ద్వారా ఒక్కో మహిళలకు మొక్కల సంరక్షణ బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. ఇక ఇళ్లలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ఆయా గృహాల మహిళలు చూసుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఆయన రాష్ట్ర సమస్యలపై మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నా, ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ఎక్కడ లోటు లేకుండా చేస్తుందన్నారు. ఇక సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాలు రాజ్యాంగ పదవిలో ఉండి సైతం అభివృద్ధి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు విషయంలో ఎవ్వరైన దళారులు వసూళ్లకు పాల్పడితే తీసుకున్న వారు, ఇచ్చిన వారు ఇద్దరిపై చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్లు, రేషన్, మరుగుదొడ్లు, వ్యవసాయ పనిముట్లు, ముఖ్యంగా లక్షల ఇళ్లు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

## పై డేటా సెంటర్‌తో నిరుద్యోగ యువతకు అవకాశాలు మెండు

ప్రాంతాలను సెంటర్ మొత్తం కలియతిరిగి పరిశీలించారు. దేశ విదేశాల నుంచి విచ్చేసి సుమారు 350 మందితో ముఖ్యమంత్రి పాల్గొనే సభా వేదికను కూడా పరిశీలించారు. అవసరమైన సలహాలు, సూచనలను కళ్యాణ్‌కు వివరించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ శశిధర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి కార్యక్రమం పూర్తి అయ్యేంతవరకూ విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖాధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యగా తగినన్ని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కోరారు. ముఖ్యమంత్రి మంగళగిరిలోకి ప్రవేశించే ప్రాంతం నుండి కార్యక్రమం ప్రారంభించే ప్రాంతం వరకూ సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని అమలు చేయాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు.

అనంతరం మీడియాతో కలెక్టర్ శశిధర్ మాట్లాడుతూ, నవ్యాంధ్ర రాజధానిలో సమాచార సాంకేతిక సంస్థలు ఏర్పాటు కావడం హర్షణీయమని అన్నారు. ఇటీవల ఫైకేర్ సంస్థ రాగా, ఇప్పుడు పై డేటా సెంటర్ రావడం సంతోషమని, నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో, నవ్యాంధ్ర రాజధానిలో నూతనంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు, కంపెనీలకు జిల్లా యంత్రాంగం తమ వంతు పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని కలెక్టర్ శశిధర్ వెల్లడించారు.

## నామన ఇంటి వద్ద కాపు వర్గీయుల నిరసన

మామిడికుదురు : మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇచ్చిన పిలుపు మేరకు కాపు సంఘ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా మండలంలోని మగటపల్లి వెళ్లి అక్కడ తెదేపా జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు స్వగృహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి చినరాజప్పకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడే కొద్దిసేపు బైఠాయించారు. లోపల్నించి నామన బయటకు రాగానే నినాదాలతో మరింత హోరెత్తించారు. కాపు ఉద్యమానికి సంబంధించి ఇప్పటికైనా అసత్య ప్రకటనలను మానుకోవాలని సంఘ నాయకులు పేర్కొన్నారు. రిజర్వేషన్ల సాధనకు కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన నామన మాట్లాడుతూ ఇదే అంశానికి సంబంధించి వచ్చే వారంలో హోం మంత్రి చినరాజప్పతో కలిసి తామంతా ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు. కాపులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేలా తాము కృషి చేస్తామని చెప్పడంతో నిరసనకారులు శాంతించారు. కాపు సంఘ నాయకులు అడబాల రామసత్యనారాయణ, జక్కంపూడి వాసు, తోరం సూర్యభాస్కర్, పోతు కాశీ, బండారు కాశీ, తులా గోపాలకృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## అమలాపురంలో ఉత్కంఠ



అమలాపురం : ముద్రగడ పాదయాత్రను పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో అమలాపురంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ముద్రగడ పాదయాత్ర చేసేందుకు బయటకు వచ్చే వరకూ కాపు సామాజిక వర్గ నాయకులు శాంతంగానే ఉన్నారు. ముద్రగడను అడ్డుకోవడంతో ఒక్కసారిగా ఆ సామాజిక నాయకులు నిరసనలు తెలిపారు. తెలగ, బలిజ, కాపు ఐక్య కార్యాచరణ సమితి కోనసీమ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితర నాయకులు చేతులకు తాళ్లు కట్టుకుని పాదయాత్ర చేసేందుకు ఇంటి నుంచి రహదారిపైకి వచ్చారు. ఈలోగా పోలీసులు వారిని అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు. కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్‌లు గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి తమ గోడును చెబుతామని ప్రయత్నించగా.. వారిని అమలాపురం డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ శ్రీనివాస్ అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు.

మహిళా కాపు జేఏసీ నాయకురాలు దుర్గాభాయి, దివంగత నల్లా సూర్యచంద్రరావు తనయులను కూడా హౌస్ అరెస్టులో ఉంచారు. మరోవైపు కాపు నేతలంతా పట్టణ పోలీసు స్టేషన్‌ను ముట్టడిస్తారనే ప్రచారం రావడంతో పోలీసులు స్టేషన్ వద్ద భారీగా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఒక రహదారి పూర్తిగా మూసుకుపోయింది. ఫలితంగా ఉదయం 11 గంటల నుంచి సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## రిమ్స్‌లో అత్యాధునిక శస్త్రచికిత్స గది



కడప : జిల్లాలో ఏ కార్పోరేట్ వైద్యశాలలో లేని విధంగా రిమ్స్ వైద్య విజ్ఞాన సంస్థలో శస్త్రచికిత్స రోగుల అవసరార్థం అత్యాధునిక వసతులతో ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్ తెలిపారు. బుధవారం రిమ్స్ జనరల్ సర్జరీ విభాగంలోని శస్త్రచికిత్స గదిని ఆయన ప్రాంభించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు రెండు గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచేందుకు ఈ గది ఉపయోగపడుతుందని అన్నారు. ఇక్కడ అత్యాధునిక వసతులు కలిగిన రోగిని ఏ వైపుకు తిప్పాలన్నా వీలుగా ఉండే 14 మంచాలు (పౌలర్ కాట్స్), రోగి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేసే 14 మానిటర్లు, శ్వాస ఇబ్బందులు తలెత్తితే వెంటనే అమర్చేందుకు వెంటిలేటర్లు, బీపీ యంత్రాలు, ఆక్సిజన్ అందించేందుకు ప్రత్యేక సిలిండర్లు, పల్స్‌రేటర్స్, ఈసీజీ, గుండె సమస్యలు ఎదురైతే షాక్ ఇచ్చేందుకు డీ-ఫిబ్రిలేటర్స్ అన్ని ఇక్కడే ఉంటాయని అన్నారు. దాదాపు ఈ సౌకర్యం ఏ కార్పోరేట్ వైద్యశాలలో కూడా లేదన్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని ఈ రికవరీ గదిలో రెండు గంటలు ఉంచి ఎలాంటి ఇబ్బంది లేనప్పుడు మాత్రమే వార్డుకు మారుస్తామని చెప్పారు.

ఈ గదికి అనస్తీషియా వైద్యులు డాక్టర్ సునీల్ రూ.30 వేలు విలువ చేసే ఆరు ఫంకాలు ఉచితంగా అందించారని చెప్పారు. సూపరింటెండెండ్ ప్రత్యేక నిధుల నుంచి వెంటనే ఏసీలు మరమ్మతు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటశివ, అనస్తీషియా వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ సుకుమార్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ మంజు, ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎఫ్ రుణాల మంజూరుకు కృషి

కాకినాడ : జిల్లా పరిషత్ ద్వారా పీఎఫ్ రుణాలు సత్వరమే మంజూరయ్యేలా కృషిచేస్తానని తాత్కాలిక జడ్పీఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ హామీ ఇచ్చారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు కె.జయరాజు ఆధ్వర్యంలో ఆ సంఘానికి చెందిన ఉపాధ్యాయులు నవీన్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జడ్పీలో పీఎఫ్ రుణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని, గృహనిర్మాణాలు, వివాహాలు, ఇతర ఖర్చులకోసం రుణాలకు దరఖాస్తుచేసుకుని ఎదురుచూడాల్సి వస్తోందని నవీన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పదించిన ఆయన సంబంధిత పర్యవేక్షకులు, సీఈవోతో మాట్లాడి సత్వరమే పీఎఫ్‌రుణాలు మంజూరయ్యేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జడ్పీ పాఠశాలలకు ప్రహరీ సదుపాయం కల్పించాలని, రాత్రి కాపలాదారులను నియమించాలని కోరుతూ టీఎన్‌యూఎస్ తరపున నవీన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణమోహన్, అసోసియేటెడ్ అధ్యక్షుడు చాత్రాది సత్యనారాయణ, కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల వివరాలు రోజువారీ తెలియజేయాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో పనులు నిలిచిపోవడంపై ప్రశ్నించారు. సాధ్యమైనంత వరకు త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. డివిజన్ పరిధిలో అయిదు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులపై ఆరా తీశారు. కోరుకొండ మండలంలో పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించిన నిధులతో ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులను నిలదీశారు. కొత్త ఓటర్ల నమోదు కోసం కళాశాలల్లో చేపట్టిన అవగాహన సదస్సులు, ఫారం-6 సేకరణ వాటి వివరాలు వెబ్‌సైట్‌లో చేర్చాలని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఆయా పాఠశాల యాజమాన్యంతో చర్చించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు

### పేద విద్యార్థులకు
## అక్షయపాత్ర చేయూత
## 25వేల మందికి బూట్ల పంపిణీ

తాడేపల్లి : కృష్ణా గుంటూరు జిల్లాల్లో అక్షయపాత్ర ఆధ్వర్యంలో 25 వేల మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు మహా విష్ణుదాసా తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎంఈవో జ్యోతికిరణ్ అధ్యక్షత వహించారు. గుంటూరు జిల్లాలోని 176 పాఠశాలల్లో 18 వేల మందికి, మరో 7వేలు బూట్లను కృష్ణాజిల్లాలోని విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు. తొలివిడతగా గుంటూరు జిల్లాలోని తాడేపల్లి మంగళగిరి, తుళ్లూరు మండలాల్లో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఒకటి నుంచి ఐదోతరగతి విద్యార్థులకు మాత్రమే అందజేస్తున్నట్లు చెప్పారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షులు వంశీధర్‌దాసా, ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు వీఎస్ నాగేశ్వరరావు, పద్మావతి, సుజాత, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా పనిచేస్తే సహించేది లేదు

- మంత్రి అచ్చెన్నాయుడు



తిరుపతి : జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు నిర్లక్ష్యంగా పనిచేస్తే సహించేది లేదని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో తెదేపా జిల్లా సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ మరింత పుంజుకోవాల్సి ఉందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు తమ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా చూడాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచి కష్టపడి పనిచే యాలని కోరారు. జిల్లాలో నాయకులు, కార్యకర్తల పనితీరుపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అందరూ సమిష్టిగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకుల్లో కొంత మార్పు రావాల్సి ఉందని ఉద్ఘాటించారు. మంత్రి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు తమ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తల నడుమ సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.

అనంతరం నియోజకవర్గాల వారీగా నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ డాక్టర్ శివప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ వర్ల రామయ్య, ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

### ముగిసిన అమ్మవారి
## తిరువడిపురం ఉత్సవం
### వేడుకగా స్నపనతిరుమంజనం



తిరుపతి : తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం ఘనంగా జరిగింది. ఆషాడమాసంలో పరమ పవిత్రమైన పూర్వ ఫల్గుణి నక్షత్రం రోజున శ్రీ గోదాదేవి అమ్మవారు అవతరించారు. ఈ పవిత్ర రోజును పురస్కరించుకుని శ్రీ గోవింద రాజస్వామి ఆలయంలో ఏటా పదిరోజుల పాటు తిరువడిపురం ఉత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీ గోవిందరాజ స్వామి, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవ మూర్తులకు వేడుకగా స్నపనతిరుమజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 4గంటలకు శ్రీ గోవిందరాజస్వామి, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీ గోవిందరాజస్వామి ఆలయం నుంచి వూరేగింపుగా అలిపిరికి తీసుకెళ్లారు. అక్కడి శ్రీవారి పాదాల మండపంలో ఘనంగా ఆస్థానం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి గీతామందిరం, రామ్‌నగర్ క్వార్టర్స్, వైఖానసాచార్యుల ఆలయం, ఆర్‌ఎస్ మాడ వీధి, చిన్నజీయర్ మఠం మీదుగా వూరేగింపు మళ్లీ ఆలయానికి చేరుకుంది.

కార్యక్రమంలో ఆలయ ఉపకార్య నిర్వాహణాధికారి వరలక్ష్మి, సహాయ కార్య నిర్వాహణాధికారి ప్రసాదమూర్తిరాజు, ఆలయ అర్చకులు, అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వూరేగింపులో భాగంగా స్థానిక సరోజినిదేవి రోడ్డులోని సీతరాములవారి భజన మందిరం నిర్వాహకులు శ్రీ గోదాదేవి అమ్మవారికి పుష్పమాలలు అందజేశారు. అనంతరం భక్తులకు ప్రసాదలను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఆర్‌ఆర్‌శ్రీనివాస్, మనోహర్, శ్రీహరిరావు, మురళీకృష్ణ, విమల్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



గుంటూరువారితోట : మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, వివేకానంద లాంటి మహనీయులు నిజమైన హీరోలని వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులు చదివి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ పిలుపునిచ్చారు. కొత్తపేట ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల ఆవరణంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి ఏఎన్‌యూ ఆచార్యులు నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై అవగాహన పెంచుకుని వాటిన భారినపడకుండా యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో తల్లిదండ్రులు, పాఠశాలలు, కళాశాలలు పాత్ర కీలకమన్నారు. తల్లిదండ్రుల ఒత్తిడి, డబ్బు సంస్కృతి, అపరిచిత వ్యక్తుల ఫేస్‌బుక్‌ల ద్వారా పరిచయాలు విద్యార్థులు తప్పుదోవపడుతున్నారని తెలిపారు. పిల్లల్లో ఉన్న కళలను ప్రోత్సహించే దిశగా తల్లిదండ్రుల్లో మార్పురావాలని, పిల్లలు సైతం ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని ఆయన సూచించారు. కొద్దిపాటి పొరపాట్లకు కుంగిపోవద్దని ఏ ఒక్కరికి ఒకేసారి విజయం దరిచేరదన్నారు. సోషల్ మీడియా వల్ల మంచి జరగడతోపాటు చెడు, అనర్థాలు జరుగుతున్నాయని అందులో మంచిని మాత్రమే తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో 30-40 పాఠశాలల్లో విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడినట్లు మీడియా, పత్రికల్లో చూశామన్నారు. కావున వాటి గురించి తెలుసుకోకపోతే మనలో ప్రతి ఒక్కరిని తాకే ప్రమాదం ఉందన్నారు. యువత సెల్ఫీ సంస్కృతిని వీడాలని సూచించారు. రైళ్లు, బహుళ అంతస్తులు పైకెక్కి సెల్ఫీ తీసుకోవడం శ్రేయస్కారం కాదన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ సెంటర్‌లు నెలకొల్పాలని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎవరూ వస్తున్నారు..? ఎవరూ వెళ్తున్నారనే అంశాలపై నిఘా ఉండాలన్నారు. ఎవరి జీవితాలను వారే తీర్చిదిద్దుకోవాలని, చిన్న పొరపాట్లను సరిదిద్దుకుంటే మంచి ప్రయోజకులు అవుతారన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాల్లో ఇటువంటి అవగాహన సదస్సులు మరిన్ని ఏర్పాటు చేసి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచి వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ర్యాంగింగ్‌పై త్వరలో విశ్వ విద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వర్తించనున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలు అంటే ఏమిటి..? దానికి ఎందుకు బానిసవలవుతారు..? ఆ తరువాత భవిష్యత్తు ఎలా ఉంటుందనే అంశాలపై ఆయన వివరించారు. ఎన్నారై విద్యాసంస్థల కార్యదర్శి, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీసేందుకు మాఫియాలు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. కొన్ని వర్గాలను, యువత, సినీ రంగం, కార్పొరేట్ సెక్టార్లను కేంద్రంగా చేసుకుని వాడుకుంటున్నారని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలను నిరోధించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. తెదేపా తూర్పు ఇన్‌ఛార్జి మద్దాళి గిరి, జడ్పీ వైస్‌ఛైర్మన్ పూర్ణచంద్రరావు, మైనార్టీ కార్పొ రేషన్ ఛైర్మన్ హిదాయత్, తెలుగు యువత అధ్యక్షుడు మల్లి, ఔషధ నియంత్రణ శాఖ జేడీ వినయ్‌కుమార్, ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్, నాట్స్ ప్రతినిధులు మన్నవ మోహన్‌కృష్ణ, గుత్తికొండ శ్రీనివాస్, ప్రసాద్,వైద్యాధికారి టి.రమేష్, కోలా నాగరాజు, జీవీవీరాయ్, ప్రిన్సిపల్ గౌస్ తదితరులు మాట్లాడారు.

# విజయభాను సంపాదకీయం

## ఆచితూచి నిర్ణయం

మోదీ- అమిత్‌షా బీహార్‌లో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సూక్ష్మస్థాయిలో ప్రచారం నిర్వహించారు. అయినా బీజేపీ ప్రతిపక్ష ఉమ్మడి శక్తిని జయించలేక పోయింది. రెండు ఏండ్లలో సార్వత్రిక ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఒక్కో రాష్ట్రంలో పావులు కదుపడం మొదలైంది. బీహార్‌లో మహాఘట్ బంధన్‌ను చీల్చడం కూడా మోదీ- అమిత్ షా వ్యూహమనే అభిప్రాయం కలుగుతున్నది. బీజేపీ వ్యూహం ఏమైనప్పటికీ, విలువలతో నిమిత్తం లేకుండా అధికారం కోసం నితీశ్ వేస్తున్న పిల్లి మొగ్గలు మాత్రం సమర్థనీయం కాదు. బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యూ) అధినేత నితీశ్ కుమార్ బుధవారం గవర్నర్‌ను కలిసి తన పదవికి రాజీనామా సమర్పించడంతో అధికార కూటమి అయిన మహాఘట్‌బంధన్ కుప్పకూలిపోయింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న లాలూ కుమారుడు ఉప ముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్ తన పదవికి రాజీనామా చేయాలని నితీశ్ కొద్ది రోజులుగా కోరుతున్నారు. అయినా తేజస్వి తన పదవిలో కొనసాగుతుండటంతో తన అసంతృప్తిని అనేక విధాలుగా వ్యక్తం చేశారు. జూన్ 20న ఆదాయపు పన్ను శాఖ అధికారులు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలోని ఆరుగురిపై నేరారోపణ చేశారు. తేజస్వి యాదవ్‌తో సహా మరో ఐదుగురి పేర ఉన్న ఆస్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నితీశ్ ఎంత కోరినప్పటికీ తన కుమారుడు తేజస్వి రాజీనామా చేయడానికి ఆర్‌జేడీ నేత లాలూ ప్రసాద్ అంగీకరించలేదు. తమపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవని లాలూ కుటుంబం ఆరోపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ రంగంలోకి దిగి లాలూ, నితీశ్ మధ్య రాజీ కుదుర్చడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గత వారం రోజులుగా సం క్షోభం తీవ్రస్థాయికి చేరుకొని ఏ క్షణాన్నయినా అధికార కూటమి కూలిపోవచ్చునని తెలుస్తూనే ఉన్నది. ఈ సంక్షోభానికి పరాకాష్టగా నితీశ్ తన పదవికి రాజీనామా సమర్పించారు. లాలూ ప్రసాద్ లేదా బీజేపీ మద్దతు ఇస్తే తప్ప నితీశ్ కుమార్ అధికారం నెరుపలేరనేది తెలిసిందే. లాలూ కుమారుడు తేజస్వి యాదవ్‌పై అవినీతి ఆరోపణలు రావడం వల్లనే విలువలకు కట్టుబడి తాను రాజీనామా చేసినట్టు నితీశ్ చెప్పుకుంటున్నారు. కానీ నితీశ్ రాజకీయ చరిత్ర, ఆయన ఎత్తుగడలు గమనిస్తే విలువలకు కట్టుబడి లేదా ఆవేశంతో రాజీనామా చేశారని అనిపించదు. అవసరార్థం పొత్తులు కుదుర్చుకుంటూ అధికారంలో కొనసాగడంలో నితీశ్ దిట్ట. బీహార్‌లో నితీశ్‌కు స్వయంగా విస్తృత రాజకీయ పునాది లేదు. సొంత సామాజికవర్గం కూడా చాలా చిన్నదే కాకుండా, అంతగా రాజకీయ ప్రాబల్యం ఉన్నది కాదు. సొంతంగా ఎన్నికలలో గెలిచే బలం లేకున్నా ఎప్పటికప్పుడు లెక్కలు వేసుకొని అడుగులు వేస్తుంటారు. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయం కూడా ఆచితూచి తీసుకున్నదే. బీజేపీ బిహార్‌లో బలమైన నాయకుడైన లాలూను దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్న దశలో నితీశ్ ఆ పార్టీతో చేతులు కలిపి అధికారం చేపట్టారు. కొంతకాలం తరువాత బీజేపీ మతతత్త పార్టీ అంటూ పొత్తు ఒదులుకున్నారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ బీజేపీతో పొత్తు వదిలి సొంతంగా అధికారం కైవసం చేసుకున్నట్టుగా తాను కూడా సొంత ప్రతిష్ఠతో గెలువగలనని నితీశ్ భావించారు. కానీ నవీన్ పట్నాయక్ తండ్రి బీజూ పట్నాయక్ ఒకప్పుడు ఒడిశాలో బలమైన నేత. ఆ రాజకీయ పునాది నవీన్ పట్నాయక్‌కు కలిసివచ్చింది. ఇందుకు భిన్నంగా నితీశ్ 2014 లోక్‌సభ ఎన్నికలలో ఒంటరిగా పోటీచే సి ఘోర పరాజయం పొందారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలలో మహా కూటమి ఏర్పరుచుకొని లాలూతో కలిసి పోటీచేసి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ విధంగా అటూఇటూ దుంకు తూ పన్నెండేండ్ల నుంచి ముఖ్యమంత్రిగా ఉంటున్నారు. ఎన్నికల పొత్తు పెట్టుకున్నప్పుడు లాలూ ప్రసాద్ అవినీతి నేపథ్యం నితీశ్‌కు తెలువంది కాదు. ఎన్నికల ముందు ఒప్పందంలో భాగంగానే తేజస్వి యాదవ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి లభించింది. ఇంతకాలం లాలూ ప్రసాద్ నేతృత్వంలోని ఆర్‌జేడీతో పొత్తు కొనసాగించిన నితీశ్ ఇప్పు డు హటాత్తుగా అవినీతిని సహించబోనని చెప్పుకోవడం ఆశ్చర్యకరమే. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో అవగాహన కుదుర్చుకున్న తరువాతనే నితీశ్ లాలూ కుమారుడు తేజస్వి మంత్రివర్గం నుంచి వైదొలగాలనే డిమాండ్ ముందు పెట్టారనే అభిప్రాయం బలంగా ఉన్నది. రాష్ట్రపతి ఎన్నికలలో కూడా నితీశ్ లౌకిక కూటమి అభ్యర్థి, బీహార్ బిడ్డ అయిన మీరా కుమార్‌కు కాకుండా, బీజేపీ అభ్యర్థి అయిన రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతు ఇచ్చారు.

## ముగ్గురు ఉగ్రవాదులు హతం!

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ వద్ద ఉగ్రవాదుల చొరబాటుయత్నాన్ని భద్రతా దళాలు భగ్నం చేశాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల్ని హతమార్చాయి. 'గురేజ్ సెక్టార్‌లో ఎల్‌వోసీ వద్ద గురువారం ఉదయం జరిగిన చొరబాటుయత్నాన్ని భగ్నం చేశాం.

ఈ సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు' అని ఆర్మీ తన అధికారిక ట్విట్టర్ పేజీలో వెల్లడించింది. అనంతరం మరో ఉగ్రవాది హతమైనట్టు వెల్లడించింది. ప్రస్తుతం ఇక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

గత నెలలో కశ్మీర్‌లోని ఉడీ సెక్టార్‌లో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసి.. ఐదుగురు ఉగ్రవాదుల్ని భద్రతా దళాలు హతమార్చిన సంగతి తెలిసిందే.

## మహిళా ప్రయాణికులకు విస్తారా ఆఫర్




న్యూఢిల్లీ : దిల్లీకి చెందిన విస్తారా ఎయిర్‌లైన్స్ మహిళా ప్రయాణికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. విమానంలో ఒంటరిగా ప్రయాణించే మహిళలకు మధ్య సీట్లు కాకుండా విండో సీట్లు లేదా వరుసలో మొదటి సీట్లు కేటాయించాలని నిర్ణయించింది. అంతేకాకుండా విమానం ఎక్కేముందు, దిగాక కూడా వారి అవసరాలను చూసుకోవాలని నిర్ణయించింది.

రోజులో 75 నుంచి 100 మంది మహిళా ప్రయాణికులు ఈ సేవలు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. మహిళా ప్రయాణికులకు ఇలాంటి ఆఫర్ ప్రకటించిన తొలి ఎయిర్‌లైన్ సంస్థ విస్తారానే కావడం విశేషం. విమానం ల్యాండ్ అయ్యాక దిగేటప్పుడు మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవడం గమనించామని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని విస్తారా చీఫ్ సంజీవ్ కపూర్ వెల్లడించారు.

విస్తారాలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు ఎయిర్‌పోర్ట్ చేరుకోవడానికి ఎయిర్‌పోర్ట్ ఆధారిత ట్యాక్సీలను బుక్ చేయించడంతో పాటు విమానం దిగాక వారి అనుమతి మేరకు దగ్గరుండి ట్యాక్సీ ఎక్కించే ఏర్పాట్లు మా సిబ్బందే దగ్గరుండి చూసుకుంటారు. ఇలాంటి చర్యలతో మహిళలు విస్తారా విమానాల్లో నిశ్చింతగా ప్రయాణించే వీలుంటుంది అని వెల్లడించారు సంజీవ్.

ఈ కొత్త సర్వీసులను అంతర్జాతీయంగానూ విస్తరింపజేసి విదేశీ మహిళలకు కూడా ఈ సదుపాయాలను కల్పించనుంది విస్తారా.

అంతేకాకుండా విస్తారా విమానాల్లో బోయింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో శిక్షణ తీసుకున్న పైలట్లనే ఎంపిక చేసుకునేందుకు సన్నాహాలు చేస్తోంది.

## పోలీసులను ఆశ్రయించిన బాలీవుడ్ నటి



ముంబయి: మసీదుల నుంచి వచ్చే ఆజాన్(నమాజ్ పిలుపు) శబ్దానికి చెవులు పగిలిపోతున్నాయని బాలీవుడ్ నటి, గాయిని సుచిత్ర కృష్ణమూర్తి ఇటీవల సోషల్ మీడియాలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. మతతత్వాన్ని ఇలా ఇతరులపై ప్రదర్శించడం కంటే మూర్ఖమైన పని మరొకటి ఉండదని కూడా ఆమె ట్విటర్‌లో పేర్కొన్నారు. దీంతో కొందరు నెటిజన్లు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మతాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదని మండిపడ్డారు.

తాజాగా సుచిత్రపై నెటిజన్లు అభ్యంతర వ్యాఖ్యలు చేయడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. బుధవారం ఆమె ముంబయి పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఎదుట దిగిన ఫొటోను సుచిత్ర ట్విటర్‌లో పంచుకున్నారు. ముంబయి పోలీసులకు ధన్యవాదాలు. మీరు బెస్ట్ అని ఆమె పేర్కొన్నారు. అంతకుముందు నెటిజన్లు ఆమెపై చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను ఫొటో తీసి ట్విటర్‌లో పెట్టారు.

ఈ వ్యాఖ్యలు చూడండి. నా దేశాన్ని చూస్తే జాలేస్తోంది. మహిళల పట్ల ఇలాంటి తీరు వ్యక్త పరచడం ఆశ్చర్యపరిచింది అని ఆమె పేర్కొన్నారు.

గతంలో ఆజాన్ శబ్దానికి నిద్రపట్టడంలేదని ప్రముఖ బాలీవుడ్ నటుడు సోనూ నిగమ్ ట్వీట్ చేసి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

## కోటీశ్వరులైన పాకిస్థాన్ క్రికెటర్లు



కరాచీ: ఒక్క విజయం పాక్ క్రికెటర్ల జీవితాలనే మార్చేసింది. వాళ్లపై కాసుల వర్షం కురిపిస్తున్నది. చాంపియన్స్ ట్రోఫీ గెలుపుతో ప్లేయర్స్‌కు భారీగా డబ్బు, లగ్జరీ కార్లు, బంగ్లాలు గిఫ్ట్‌లుగా వచ్చాయి. తాజాగా ఐసీసీ కూడా ప్రైజ్‌మనీని పంపించింది. ట్రోఫీ గెలిచిన పాక్‌కు ఏకంగా రూ.23 కోట్లు వచ్చాయి. ఎలాంటి ట్యాక్స్ కట్ చేయకుండా.. ఈ మొత్తం పాక్ క్రికెట్ బోర్డుకు చేరింది. దీనిని 17 భాగాలు చేసింది పీసీబీ. 16 ప్లేయర్స్‌కు, మిగతా ఒక భాగం మేనేజ్‌మెంట్‌కు ఇవ్వనున్నారు. ఈ లెక్క ప్రకారం ఒక్కో ప్లేయర్‌కు రూ.కోటి 35 లక్షలు అందనున్నాయి. అటు కోచ్‌లు, ఇతర సపోర్ట్ స్టాఫ్ ఉన్న మేనేజ్‌మెంట్‌లో ఒక్కో సభ్యుడికి రూ.పది లక్షలు ఇవ్వనున్నారు. చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత సొంతగడ్డపై అడుగుపెట్టగానే.. ప్లేయర్స్‌కు పీఎం నవాజ్ షరీఫ్ గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటుచేశారు. ఈ సందఠంగా ఒక్కో ప్లేయర్‌కు రూ.కోటి క్యాష్ అవార్డు ప్రకటించారు షరీఫ్. మేనేజ్‌మెంట్‌కు రూ.50 లక్షలు, కోచ్‌లకు రూ.25 లక్షలు ప్రకటించారు. చీఫ్ సెలక్టర్ ఇంజమాముల్ హక్ కూడా రూ.కోటి అందుకున్నాడు.

## సమయం

### లోకం - లోకం

అధరాలపై మధువు - హృదయంలో విషం
నీతులు చెపుతూ - గోతులు తీసే
మాటకారిలోకం -వేటగాళ్ల లోకం...
ఉన్నవాడికే ఉన్నతనం- లేనివాడికి లేమితనం
ఉండి, లేనివాడికిస్తున్నది వెర్రితనం
కన్యాశుల్కాలంటూ కాల్చిందా నాడు
వరకట్నాలంటూ వేడుతున్నదీనాడు
జాతులన్ని ఒకటే నంటూ
నీతులు చెప్పే లోకం
ఎవరి జాతి వారిదంటూ ఎత్తి చూపే లోకం
చేతకాని లోకం -నీతి లేని లోకం
చచ్చువెధవ లోకం- బీడు వారిన లోకం
మోడుబారిన లోకం
ఎంత చదువదామన్న అంతుచిక్కని లోకం
ఎంత వ్రాద్దామనుకున్న అంతు దొరకని లోకం
చేతకాని లోకం- ఊతలేని లోకం

కవిత రచన :
శ్రీ స్వామి అప్పాజి భగవాన్

## పంచాంగం

మాసం : శ్రావణ; తిథి : పంచమి ఉ. 9.33
ఉత్తర ఉ.8.19 వ.సా. 4.58ల 6.36
శుక్రవారం 28-07-2017

**మేషం** : పత్రికా, ప్రైవేటు సంస్థల్లోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కీలక మైన వ్యవ హారాల్లో తీసుకున్న నిర్ణయాల వల్ల కష్టనష్టాలు ఎదుర్కొంటారు. వాహ నం నడు పుటలో మెలకువ అవసరం. **వృషభం** : ప్రముఖులు, సన్ని హితుల కలయిక సాధ్యంకాదు. నిరుద్యోగయత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. క్రయ విక్రయాలు సామాన్యం. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఆత్మీ యులకు విలువైన బహుమతులు అందిస్తారు. ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్న ప్రమోషన్ అందు కుంటారు. **మిథునం** : అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తు లకు, జాయింటు వ్యాపారస్తుల శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. గతంలో విడిపోయిన భార్యా భర్తలు తిరిగి కలిసే అవకాశం ఉంది. నిత్యావసర వస్తు స్టాకిస్టు లకు లాభ దాయకం. **కర్కాటకం** : మీ సంతానం భవిష్యత్ గురించి కొత్త కొత్త ప్రణాళి కలు రూపొందిస్తారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. ఉద్యోగం చేయు స్త్రీలకు దూరప్రాంతాలకు బదిలీలు అవుతాయి. శస్త్ర చికిత్స చేయునప్పుడు వైద్యులకు ఏకాగ్రత అవసరం. కార్మికులకు, ప్రైవేటు సంస్థలందు పనిచేసే క్రింది ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది. **సింహం** : సోదరీ, సోదరుల మధ్య ఆస్తి విషయాల గూర్చి తగాదాలు రావచ్చు. ప్రముఖుల ద్వారా ఉద్యోగస్తులు కొత్త పనులు చేపడతారు. చేపట్టిన పనులు అర్థాంతరంగా ముగించాల్సి వస్తుంది. కుటుంబంలో ఒకరి ధోరణి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించేందుకు అనువైన సమయం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. **కన్య** : నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లకు ఓర్పు, నేర్పు ఎంతో ముఖ్యం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులను అతిగా విశ్వసించటం వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది జాగ్రత్త వహించండి. బంధుమిత్రులతో కీలకమైన విషయాలు చర్చలు జరుపుతారు. ఖర్చులు ప్రయోజనకరం. **తుల** :కొన్ని ముఖ్యమైన విషయాల్లో పట్టువిడుపు ధోరణితో వ్యవహరించటం మంచిది. వైద్యులకు ఒత్తిడి, ఇంజనీరింగ్‌లకు సంతృప్తి, ప్లీడర్లకు చికాకులు తప్పవు. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక వ్యాపారులకు మందకొడిగా ఉంటుంది. పారిశ్రామిక, కార్మిక సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. మీ శత్రువులే మీకు మిత్రులై సహాయ, సహ కారాలను అందిస్తారు. **వృశ్చికం** : ఉత్తర ప్రత్యుత్తరాలు సమర్థవంతంగా నిర్వ హిస్తారు. వృత్తి, వ్యాపారులకు ఆశించినంతగా పురోభివృద్ధి ఉండదు. ఉద్యోగస్తులు పదోన్నతి కోసం చేసే యత్నాలు కొంతవరకు సఫలం అవుతాయి. ప్రయాణాలు, ఇతర కార్యక్రమాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులు ఉద్యో గాలకై చేయు ప్రయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. **ధనుస్సు** : స్త్రీలకు అలంకరణలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. ఒక ముఖ్య విషయమై న్యాయసలహా పొందవలసి వస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి శు భదాయకం. ప్రైవేటు సంస్థల్లోని వారికి ఊహించని మార్పులు సంభవిస్తాయి. ప్రేమికులు శుభవార్తలు వింటారు. **మకరం** :గృహంలో మార్పులు, చేర్పులకై చేయు ప్రయత్నాలు వాయిదా పడతాయి. కుటుంబీకుల ఆరోగ్యంలో శ్రద్ధ వహి స్తారు. ఒక విషయంలో మీ జీవిత భాగస్వామి సలహా పాటించటంవల్ల కలసి రాగ లదు. ఉపాధి పథకాల దిశగా నిరుద్యోగుల ఆలోచనలు ఉంటాయి. విదేశీయాన యత్నాలలో ఆటంకాలు తొలగిపోగలవు. పరోపకారానికి పోయి సమస్యలు తెచ్చు కోకండి. **కుంభం** : ఉద్యోగస్తులు అధికారులతో ఏకీభవించలేరు. ఏజెంట్లకు, బ్రోకర్లకు పురోభివృద్ధి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్ల విషయంలో ప్రతికూలతలు, చికాకులు ఎదురవుతాయి. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లోని వారి శ్రమకు తగిన ప్రతిఫలం కానరాదు. **మీనం** : మిత్రుల నుండి ఒక ముఖ్య సమాచారం అందుకుంటారు. విద్యార్థినులు పట్టుదలతో శ్రమించిన సత్ఫలితాలు సాధించగలరు. ఆరోగ్యం విషయంలో అధికమైన జాగ్రత్త అవసరం.



## హయగ్రీవావతారం

### సంకీర్తన

సకల చరాచర సృష్టికి కర్త అయిన బ్రహ్మకు శక్తిని ఇచ్చేవి వేదాలే, ఆ వేదాల సంరక్షణలో నిరంతరం మహావిష్ణువు నిమగ్నమై ఉంటాడని, విష్ణుతత్వ మహత్యాన్ని, వేద విజ్ఞాన ఔన్నత్యాన్ని గురించి ఈ కథ తెలియజేస్తుంది. శ్రీ మహావిష్ణువు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ఎన్నో విధాలుగా ఎన్నెన్నో సందర్భాల్లో అవతరించాడు. తేజోవంతమైన రూపంతో ఆయన హయగ్రీవావతారం పొంది వేదాలను రక్షించాడు. కేవలం వేదోద్ధరణ లక్ష్యంగా హయగ్రీవావతారం కనిపిస్తుంది. పూర్వం శ్రీ మహావిష్ణువు నాభికమలంలో ఆసీనుడై ఉన్న సృష్టికర్త బ్రహ్మ తన పనిలో తాను నిమగ్నమై ఉండగా మధుకైటభులు అనే ఇద్దరు రాక్షసులు గదలను ధరించి మెల్లగా బ్రహ్మదగ్గరకు చేరి మనోహర రూపాలతో భాసిల్లుతున్న నాలుగు వేదాలను అపహరించారు. బ్రహ్మ చూస్తుండగానే అపహరించిన వేదాలతో ఆ దానవులు సముద్రంలో ప్రవేశించి రసాతలానికి చేరారు. వేదాలను కోల్పోయిన బ్రహ్మ వేదాలే తనకు ఉత్తమ నేత్రాలని, వేదాలే తనకు ఆశ్రయాలని, వేదాలే తనకు ముఖ్య ఉపస్యాలని అవి లేకపోతే తాను ́సృష్టిని చేయడం కుదరదని విచారిస్తూ ఆ ఆపద నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచించసాగాడు. ఆయనకు వెంటనే శ్రీమహావిష్ణువు గుర్తుకు వచ్చి పరిపరివిధాల స్తుతించాడు. బ్రహ్మ ఆవేదనను శ్రీహరి గ్రహించి వేద సంరక్షణ కోసం యోగ రూపంతో ఒక దివ్యశరీరాన్ని పొందాడు. ఆ శరీరం చంద్రుడిలా ప్రకాశించసాగింది. ఆ శరీరమే హయగ్రీవ అవతారం అయింది. నక్షత్రాలతో నిండిన ఆకాశం ఆయన శిరస్సుగా మారింది. సూర్యకిరణ కాంతితో ఆయన కేశాలు మెరవసాగాయి. ఆకాశం పాతాళం రెండు చెవులుగా, భూమి లలాటభాగంగా, గంగా సరస్వతులు పిరుదులుగా, సముద్రాలు కనుబొమ్మలుగా, సూర్యచంద్రులు కన్నులుగా, సంధ్య నాసికగా, ఓంకారమే ఆయనకు అలంకారంగా, విద్యుత్తు నాలుకగా, పితృదేవతలు దంతాలుగా, గోలోకం బ్రహ్మలోకం రెండు పెదవులుగా, తమోమయమైన కాళరాత్రి ఆయనకు మెడభాగంగా అలరారాయి. ఈ విధమైన ఒక దివ్యరూపాన్ని ధరించిన శ్రీహరి హయగ్రీవావతారం బ్రహ్మ ముందు నుంచి అంతర్ధానమై రసాతలానికి ప్రవేశించింది. అక్కడ హయగ్రీవుడు ఉదాత్త, అనుదాత్త స్వరయుక్తంగా పెద్దగా సామవేదాన్ని గానం చేయ సాగాడు. ఆ మధుర గానవాహిని రసాతలం అంతా మారు మోగింది. ఆ గానరసం రసాతలంలో వేదాలను దొంగిలించి దాక్కున్న రాక్షసుల చెవులకు కూడా సోకింది. ఆ గాన రసవాహినికి ఆ రాక్షసులిద్దరు పరవశించి బ్రహ్మ దగ్గర నుంచి తాము తెచ్చిన వేదాలను ఒక చోట భద్రం చేసి గానం వినిపించిన దిక్కుకు పరుగులు తీశారు. అయితే ఇంతలో హయగ్రీవుడు రాక్షసులు దాచిన వేదాలను తీసుకొని సముద్ర గర్భం నుంచి బయటకు వచ్చి అక్కడ ఈశాన్యభాగంలో హయగ్రీవరూపాన్ని విడిచి తన స్వరూపాన్ని పొందాడు. రాక్షసులు గానం వినిపించిన దిక్కుకు బయలుదేరి వెళ్లి ఎంత వెతికినా, ఎక్కడ వెతికినా ఎవరూ కనిపించలేదు. వెంటనే తమ వేదాలను దాచి ఉంచిన ప్రదేశానికి వెళ్లి చూశారు. అక్కడ వేదాలు కనిపించలేదు.

వెంటనే ఆ ఇద్దరూ రసాతలం నుంచి వెలుపలికి వచ్చి సముద్రంలో దివ్యతేజ కాంతిపుంజంలాగా ఉండి ఆదిశేషుడి మీద యోగ నిద్రాముద్రలో ఉన్న శ్రీమహావిష్ణువును చూశారు. ఆ రాక్షసులు తాము దాచిన వేదాలను అపహరించింది ఆ శ్వేతపురుషుడేనని, తమ దగ్గర నుంచి వేదాలను తెచ్చినది కాక ఏమీ తెలియనట్లు నిద్రిస్తున్నాడని కోపగించుకొని శ్రీమహావిష్ణువు మీదకు యుద్ధానికి వెళ్లారు.

అప్పుడు విష్ణువు ఆ రాక్షసులతో యుద్ధం చేసి వారిని సంహరించాడు. ఇలా హయగ్రీవావతారం వేదోద్ధరణ లక్ష్యంగా అవతరించింది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

SVR గోల్డ్ లోన్స్
మీ బంగారాన్ని బ్యాంక్/ప్రైవేటు సంస్థలలో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటు కంటే ఎక్కువకు కొనబడును.
Contact No:
75696 87774

శ్రీ దుర్గా మల్లేశ్వర ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం
వివాహ విషయంలో ఆటంకములు ఎన్ని సంబంధములు చూసినా కుదరకపోవుట(స్త్రీలు, పురుషులు) సంతానం లేకపోవుట, వ్యాపార విషయంలో ఆందోళనలు, ఎంత కష్టపడినా ఫలితం లేకపోవుట, సమస్యల వలన సతమతమవుట, పైన ఉదహరించిన సమస్యలకు జాతక చక్రం వేసి, నాడీ పరీక్షించి, హస్త సాముద్రికం ద్వారా మీ సమస్యలకు ఖచ్చితమైన పరిష్కారం చూపబడును.
కాలసర్ప దోషం, నాగదోషం, కుజదోషం, రాహుకేతువుల పూజ, వివాహ విషయములకు, అన్ని రకముల పూజలకు సంప్రదించవచ్చును.
పెళ్ళిరోజు, పుట్టినరోజు, మీ ఉద్యోగ విరమణ ఇలా మరే సందర్భంలో అయిన అన్నదానం చేయు భక్తులు ముందుగా సంప్రదించినచో అతి తక్కువ ఖర్చుతో అన్నదాన కార్యక్రమం జరిపించి మరియు మీ గోత్ర నామముపై విశేష పూజ జరుపబడును.
సూచన : ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని రావలెను.
హైస్కూల్ గ్రౌండ్ ఎదురుగా, దేవి పీఠం, కొత్తవలస, విజయనగరం జిల్లా.
9441126714
8331827714

# అహోబిలంలో పూజలు

అహోబిలం : నరసింహ స్వామి వీర భక్తుడైన తెలుగు రాష్ట్రాల గవర్నరు నరసింహన్ అహోబిలం క్షేత్రానికి దర్శనార్థం వచ్చిన మొదలు స్వామి పట్ల తన భక్తిని చాటుకున్నారు. నరసింహ స్వామి నవరూపాల్లో భక్తులకు దర్శనమిచ్చే ఈ క్షేత్రంలో అడుగు పెట్టేముందే గవర్నర్ తన భక్తిని చాటుకున్నారు. వాహనం నుంచి బయటకు అడుగు పెట్టే సమయంలోనే తన పాదరక్షలను వదిలేశారు. ఎక్కడ కూడా పాదరక్షలు లేకుండానే నడిచారు. నంద్యాల ఏఎస్పీగా పనిచేస్తున్న సమయంలోనూ తాను ఈ క్షేత్రానికి వచ్చినట్లు గవర్నరు నరసింహన్ తన ఏడీసీటీ. శ్రీనివాసరావుతో అప్పటి విశేషాలను పంచుకున్నారు. అప్పట్లో సౌకర్యాలు లేవని, రహదారులు కూడా బాగా ఉండేవి కావని, ఆలయం బయట ప్రస్తుతం ఉన్న నిర్మాణాల్లో చాలా వరకు అప్పుడు లేవన్నారు.

అహోబిల క్షేత్ర విశిష్ఠతను అక్కడి వారికి వివరించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ ఈశ్వర్‌రెడ్డి, సీఐ దస్తగిరిబాబు, మఠం మేనేజర్ బద్రినారాయణ,తహసీల్దారు శ్రీనివాసులు ఉండగా శిరువెళ్ల సీఐ, ఆళ్లగడ్డ ఎస్సైలు, పోలీసులు, ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించారు.

# కాపు వ్యతిరేక ధోరణిని ప్రజలు క్షమించరు

## వైకాపా నాయకుడు బొత్స సత్యనారాయణ



నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం కాపుల పట్ల ప్రవరిస్తున్న వ్యతిరేక ధోరణిని ప్రజలు క్షమించరని మాజీ మంత్రి, వైకాపా నాయకుడు బొత్స సత్యనారాయణ అన్నారు. ముద్రగడ పద్మనాభం పాదయాత్రను అడ్డుకోవడానికి ప్రవర్తించిన తీరు చూస్తుంటే ఇది ప్రజాస్వామ్యమో, పోలీసు రాజ్యమో అర్థం కావడం లేదన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడారు. సీఎం తప్పులు సరిదిద్దుకోకుంటే చరిత్ర క్షమించదన్నారు. ముద్రగడను గృహహింస, నిర్బంధించిన విధానం దారుణమన్నారు. గతంలో జరిగిన తుని సంఘటనలో యనమల రామకృష్ణుడు హస్తం ఉందన్నారు. తుని సంఘటన దర్యాప్తు వివరాలను బహిర్గతం చేయాలని డిమాండు చేశారు. కాపులపై డీజీపీ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. జాతుల్లో విభేదాలు, కులాల్లో చిచ్చు పెట్టడం చంద్రబాబు వైఖరని ఆరోపించారు. ముద్రగడ పాదయాత్ర సందర్భంగా 13 జిల్లాల కాపు నాయకులను అదుపులో తీసుకోవడం తగదన్నారు. కాపుల ఆర్థిక, సామాజిక వివరాలపై వేసిన జస్టిస్ మంజునాథ కమిషన్ నివేదికను బయట పెట్టాలని బొత్స డిమాండు చేశారు. ముద్రగడ పాదయాత్రకు ముందు ఆయనతో రాష్ట్ర మంత్రులు నిర్వహించిన రహస్య భేటీ వివరాలు కూడా బయట పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి బీవై రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా హెపటైటిస్-బి రక్తపరీక్షలు

## సీపీడబ్ల్యూఏ అధ్యక్షుడు సిరాజ్

నెల్లూరు : నగంలోని కిమ్స్ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో కమ్యూనిటీ పారా మెడికల్ అసోసియేషన్ (సీపీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో పాత్రికేయులకు, గ్రామీణ వైద్యులకు ఈనెల 28న ఉచితంగా హెపటైటీస్-బి రక్త పరీక్షలు నిర్వహించి, హెపటైటీస్ వ్యాక్సిన్‌ను అందజేస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిరాజ్ వెల్లడించారు. ఈ మేరకు నగరంలోని పొగతోటలో ఉన్న ఆరోగ్య ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిమ్స్ డె%రెక్టర్ గిరినాయుడు సహకారంతో హెపటైటీస్ డే సందర్భంగా ఈ అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ అసోసియేషన్ సభ్యులు మల్లికార్జున, బాలకృష్ణ, ఆరిఫ్, గురవారెడ్డి, హరి, రసూల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కోరితే ముద్రగడ రాజకీయ సన్యాసం

తుని: కాపులకు బీసీ రిజర్వేషన్ ప్రకటించాక ప్రభుత్వం కోరితే మాజీమంత్రి ముద్రగడతో పాటు ఆయన కుటంబసభ్యులు కూడా రాజకీయ సన్యాసం తీసుకుంటారని ముద్రగడ వియ్యంకుడు శివాజీ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తునిలో విలేకర్లతో మాట్లాడుతూ కాపు రిజర్వేషన్లు సాధించడమే ముద్రగడ లక్ష్యమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ కల్పించాలన్నారు. రిజర్వేషన్ ప్రకటించిన అనంతరం ప్రభుత్వం కోరితే ముద్రగడ రాజకీయల నుంచి వైదొలుగుతారని కావలంటే లిఖిత పూర్వకంగా కూడా రాసిస్తామన్నారు. తెదేపాలో పదవులు పొందిన కాపు నాయకులకు ముద్రగడను విమర్శించే హక్కు లేదన్నారు. ముద్రగడ ఉద్యమం వల్లే వారందరికీ పదవులు వచ్చాయన్నారు. కొన్ని వార్తా ఛానెల్లో ఉద్యమానికి సంబంధించిన కవరేజీ సరిగా ఇవ్వడం లేదని విమర్శించారు.

# ఖాళీలు చూపించాలంటూ ధర్నా

కర్నూలు : ఉపాధ్యాయుల సీనియార్టి జాబితాలో తప్పులు దొర్లుతున్నాయి.. సాంకేతిక కారణాల దృష్ట్యా కౌన్సిలింగ్ శిబిరానికి హాజరైన ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకానొక సందర్భంలో సహనం కోల్పోయి కార్యాలయం ఎదుట ధర్నాలకు దిగుతున్నారు. ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు రాఘవరెడ్డి, విద్యాధికారి తహెరా సుల్తాన సమక్షంలో రెండు శిబిరాల్లో బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉదయం ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుల ఖాళీల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు ధర్నాకు దిగారు. అధికారులు కొద్దిసేపు కౌన్సిలింగ్ నిలిపి చేశారు. పరిస్థితి తీవ్రం కాకముందే విద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో శిబిరం వద్ద పోలీసులను ఏర్పాటు చేశారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, పాఠశాల సహాయకులు గణితం-200, ఆంగ్లం-200 మందికి మంత్రణం పూర్తి చేశారు. గురువారం పాఠశాల సహాయకులు ఆంగ్లం, గణితం, బయాలాజికల్, ఫిజికల్ సైన్సు, సోషల్ సబ్జెక్టులకు మంత్రణం నిర్వహించనున్నారు.

# రుణాల మంజూరులో బ్యాంకర్ల అపోహలు వీడాలి

## ఎండీ విజయకుమార్ సూచన

కడప : పేద దళితులకు అందించే రుణాల విషయంలో బ్యాంకర్లు అపోహలను వీడి వారికి మేలు చేసేలా చూడాలి. ఆగస్టు 15వ తేదీ నాటికి ఎంపికలు పూర్తి చేసి సెప్టెంబర్ చివరి నాటికి యూనిట్లను ఏర్పాటు చేసేలా చూడాలని ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ విజయకుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సభాభవనంలో బ్యాంకర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాకు సుమారు 3093 యూనిట్లు మంజూరు చేశామని అందుకోసం సుమారు రూ.81.12 ఓట్లు విడుదల చేసినట్లు వివరించారు. యువతకు ఆదాయ వనరులు పెంచేందుకు వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరి చేందుకు సహాయపడాలన్నారు. అయితే ఎంపికైన లబ్ధిదారుల నుంచి రికవరీలు సక్రమంగా చెల్లించేలా అధికారులు చైతన్య పరచాలని తద్వారా మరిన్ని రుణాలు బ్యాంకర్లు ఇచ్చే ఆస్కారం ఉంటుందని వివరించారు. కలెక్టర్ బాబూరావు మాట్లాడుతూ.. భూ పంపిణీ వారికి స్థిరమైన ఆస్తిగా ఉండాలని, కేటాయించిన భూముల్లో పండ్ల తోటలుండాలని అధిక లాభదాయకంగా ఉండే యూనిట్లకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. సంయుక్త కలెక్టర్ శ్వేత మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు వెయ్యి ఎకరాల భూమిని గుర్తించామని ఇవన్నీ మహిళలకు విలువలైన ఆస్తులని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ కార్పొరేషన్ ఈడీ శ్రీలక్ష్మి, ఎల్డీఎం ఆంజనేయులాచారి, డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి, ఈడీలు రామచంద్రారెడ్డి, సాంబశివరావు, ఆర్డీవోలు చిన్నరాముడు, వీరబహ్మం, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంపై విద్యార్థులకు శిక్షణ

నెల్లూరు : నెల్లూరు వేదాయపాళెం జనశక్తినగర్ లోని తురిమెళ్ల నాగిరెడ్డి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక పడారుపల్లి సమీపంలోని కృషివిజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలు మేడపైన ఉద్యాన పంటలను పండించడంపై శిక్షణ ఇచ్చారు. వర్షభావ పరిస్థితుల వల్ల కురగాయల రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో మేడపై కూరగాయ మొక్కలు పెంచడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, అరుణ, పాఠశాల నిర్వహకులురాలు కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మండల ఫెసిలిటేటర్ల ఎంపికలు



ఒంగోలు : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జయరామ్ ఫెసిలిటేటర్లకు సూచించారు. ప్రగతిభవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో మండల ఫెసిలిటేటర్ల ఎంపికలో భాగంగా అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి కోసం బోలెడు పథకాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని.. గ్రామీణులకు సరైన అవగాహన లేకపోవడంతో వాటిని ఉపయోగించుకోలేకపోతున్నారని అన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులకు ప్రయోజనాలను చేర్చేందుకు ఆధునిక సాంకేతికను జోడిస్తోందన్నారు. సాంకేతిక కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు ఎలాంటి నష్టం జరగరాదన్న ఉద్దేశంతో ఒక్కొక్క మండలానికి పది మంది చొప్పున, పట్టణ ప్రాంతాల్లో ఒక్కో పట్టణానికి పది మంది చొప్పున మొత్తం 640 మంది ఫెసిలిటేటర్లను నియమించాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఆ మేరకు ఎంపికలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారు లబ్ధిదారులతో దరఖాస్తులు చేయించడం, బ్యాంకు ఖాతాలు తెరిపించడం తదితరాలు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వెబ్ పోర్టల్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకున్న వారికే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో టి.ప్రేమకుమారి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రూ.14.16 కోట్ల రాయితీతో 680 ట్రాక్టర్ల మంజూరు

## రాష్ట్రంలోనే జిల్లాకు అధిక ప్రాధాన్యం

తుని : వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్దపీట వేయడం లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యవసాయ యంత్ర పరికరాలకు పెద్ద మొత్తంలో రాయితీలు అమలు చేస్తోంది. ఈ ఏడాది రైతురథం పథకం పేరుతో అర్హులైన రైతులకు రాయితీపై ట్రాక్టర్ల పంపిణీకి యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఈ పథకం కింద ట్రాక్టర్ల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. జిల్లాకు రూ.14.16 కోట్ల రాయితీతో 680 ట్రాక్టర్లు మంజూరు చేశారు. వీటని జిల్లాలో అర్హులైన రైతులకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు లబ్ధిదారునికి రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు రాయితీ అందజేస్తారు. నాలుగు చక్రాల పుషింగ్ ట్రాక్టరుకు రోటోవీటర్‌తో కలిపి రూ.2.50 లక్షలు రాయితీగా ఇస్తున్నారు. రోటోవీటర్ వద్దనుకుంటే రూ.2 లక్షల వరకు రాయితీ అందిస్తున్నారు. రెండు చక్రాల పుషింగ్ టాక్టరుకు రోటోవీటర్‌తో కలిపి రూ.2 లక్షలు రాయితీగా మంజూరు చేస్తున్నారు. రోటోవీటర్‌ను మినహాయిస్తే దీనికి రూ.1.50 లక్షలు రాయితీ ఇస్తారు. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద లబ్ధిపొందే వారు గ్రామీణ ప్రాంత రైతులుగా గుర్తింపు కార్డు పత్రం ఉండాలి. కనీసం రెండు ఎకరాలకు పైగా సొంత భూమి ఉండాలి.


గతంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు సంబంధించి ఈ శాఖ ద్వారా ఎలాంటి రాయితీ పొంది ఉండకూడదు. రైతు పేరిట ఇప్పటికే ట్రాక్టర్ కలిగి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు ప్రాధాన్యమిస్తారు. ఆసక్తికలిగిన రైతులు తమ దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నివాస, కుల ధ్రువపత్రాలు జతచేసి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను నెలాఖరులోగా అందజేయాల్సి ఉంది.

# మత్స్య రంగం అభివృద్ధికి విశ్వవిద్యాలయం తోడ్పాటు

ముత్తుకూరు : రాష్ట్రంలో మత్స్య రంగం అభివృద్ధికి విశ్వవిద్యాలయం తోడ్పాటు ఉంటుందని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవి ద్యాలయ ఉపకులపతి డాక్టర్ వై.హరిబాబు తెలిపారు. ముత్తుకూరు మత్స్య కళాశాలలో విశ్వవిద్యాలయ నిర్వహణబోర్డు 56వ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు ఛైర్మన్‌గా ఆయన విలేకరులతో మాట్లాడారు. వైజాగ్‌లో పౌల్ట్రీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. అందుకు సంబంధించిన భూసేకరణ, ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు చెప్పారు. తమ పరిధిలో 27 కళాశాలలు ఉండగా నాబార్డు నిధులతో రూ.6.80 కోట్లతో కొత్త భవనాలు, అవసరమైన పనులు జరుగుతున్నాయని తెలిపారు. కళాశాలల్లో అధ్యాపకుల కొరతపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తామన్నారు. వెంకటాచలం మండలంలోని ఎగువమిట్ట క్షేత్రంలో అక్వా పెంపకం, పరిశోధనలు బాగున్నాయని చెప్పారు. దీనిపై తరచూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ప్రస్తావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కరుణానిధి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు



రంపచోడవరం : రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఇటీవల చాపరాయి గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన 16 మంది గిరిజనుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మంత్రి ఆనందబాబు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీలో చాపరాయి ఘటన పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఏజెన్సీలోని లోతట్టు గ్రామాల్లో 8వేల కిలోమీటర్ల అనుసంధాన రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. దశల వారీగా నిర్మాణ పనులను చేపడతామన్నారు. చాపరాయి ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఒక్కరోజులోనే నాలుగు టెలీకాన్ఫెరెన్స్‌లు నిర్వహించి రాష్ట్రస్థాయి అధికారులను, మంత్రులను అప్రమత్తం చేశారన్నారు. చాపరాయి గిరిజనులకు మంత్రి విత్తనాలను పంపిణీ చేశారు. పల్లాల మంగిరెడ్డికి పూర్తి రాయితీతో పవర్‌టిల్లర్‌ను అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ టి.రత్నాభాయి, ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, ఐటీడీఏ పీవో ఏఎస్ దినేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, సర్పంచి వై.నిరంజనీదేవి, జడ్పీటీసీ సభ్యురాలు పల్లాల రమణమ్మ, ఎంపీపీలు కర్రా వెంకటలక్ష్మి, అన్నెం సత్తిబాబు, బొడ్డగండి సర్పంచి మరిగెల నర్సమ్మ, ఆర్డీవో శ్రీరామచంద్రమూర్తి, పీహెచ్‌వో శ్రీనివాసులు, వివిధశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షలకు బదులు.. రూ.5 లక్షలు మాత్రమే అందజేయడం ఏమిటని మంత్రి ఆనందబాబును ఎమ్మెల్యే రాజేశ్వరి, ఎంపీపీ కర్రా వెంకటలక్ష్మి, సర్పంచి మరిగెల నర్సమ్మ నిలదీశారు. దీంతో మంత్రి కలుగజేసుకుని ప్రభుత్వం రూ.5 లక్షలు మాత్రమే ప్రకటించిందని, దీనిని రాజకీయం చేయవద్దని అన్నారు. చెక్కులు పంపిణీ చేసినప్పుడు తమ పార్టీకి చెందిన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులను ఆహ్వానించకపోవడంపై ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు మంత్రిని ప్రశ్నించారు. దీంతో వైకాపా ప్రజాప్రతినిధులను ఆహ్వానించి చెక్కులను పంపిణీ చేశారు.

# ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా దొంగతనాలకు చెక్

## కడప-ప్రొద్దుటూరు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

కడప : వూళ్లకు వెళ్తే దొంగతనాలు జరుగుతాయనే భయం ఇక నుంచి ఉండదు.. నిర్భయంగా నివాసాలకు తాళాలు వేసి వూళ్లకు వెళ్లొచ్చునని జిల్లా పోలీసు అధికారి బాబూజీ ప్రజలకు భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తాళం వేసిన ఇంటిని పర్యవేక్షించే (లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ విధానం) సీసీ కెమెరాను ప్రారంభించారు. సీసీ కెమెరాకు సంబంధించిన స్టిక్కర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తాళం వేసిన ఇంటిని పర్యవేక్షించే సీసీ కెమెరాలను పైలట్ ప్రాజెక్టుగా కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. చోరీల నుంచి జిల్లా ప్రజలను కాపాడేందుకు ఏపీ పోలీసు పేరిట ఉచిత చరవాణి యాప్‌ను ప్రారంభించామన్నారు. దీని ముఖ్య ఉద్దేశం నివాసాల్లో చోరీలు జరగకుండా ఉండేందుకు, దొంగలను గుర్తించేందుకు సీసీ కెమెరాల విధానం ఉపయోగపడుతోందన్నారు.

తొలుత కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ప్రారంభించి తరువాత జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఉచితంగా ఈ పరికరాన్నీ నివాసాలకు ఏర్పాటు చేస్తామన్నారు. వూరికి వెళ్లి తిరిగి వచ్చేంత వరకు మాత్రమే ఏర్పాటు చేస్తాం, తరువాత తొలగిస్తామన్నారు. భవిష్యత్తులో సొంతంగా నివాసాలకు ఏర్పాటు చేసుకునే అవకాశం వస్తుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కడపకు 50 సీసీ కెమెరాలు వచ్చాయి. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ శ్రీనివాసరెడ్డి, డీఎస్పీలు అశోక్‌కుమార్, శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి, భక్తవత్సలం, సుధాకర్, నాగేంద్రుడుతో పాటు పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ఆండ్రాయిడ్ చరవాణి కలిగి ఉండి, అందులో అంతర్జాల సౌకర్యం ఉండాలి. మీ ఇంటిలో మీ చరవాణిలో ప్లే స్టోర్ ద్వారా ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను చరవాణిలో తెరిచి అందులో రిజిష్టర్ అనే ఆప్షన్ ద్వారా మీ పేరు, చరవాణి నంబరు, పూర్తి చిరునామాను అందులో ఎంటర్ చేసి గెట్ మై కరెంటు లోకేషన్‌పై క్లిక్ చేసి తరువాత రిజిష్టర్ నౌ అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే మీ చరవాణికి ఓటీపీ నంబరు వస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ ఎవరికి వారు వారి ఇంటిలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీని వల్ల మీ ఇంటి చిరునామా కంట్రోల్ గదిలో రిజిష్టర్ అవుతుంది. తరువాత మీరు ఆ ఓటీపీ నంబరును ఎంటర్ చేసి వెరిఫై ఓటీపీ ఆష్షన్ క్లిక్ చేసిన తరువాత మీ చరవాణికి రిజిస్ట్రేషన్ పూర్తి అయినట్లు మీ చరవాణికు రిజిస్ట్రేషన్ ఐడీ వస్తుంది, దానిని మీరు రాసుకుని జాగ్రత్తగా గుర్తించుకోవాలి. మీరు ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి వూళ్లకు వెళ్లే మూడు రోజుల ముందు ఈ యాప్ ద్వారా రిక్వెస్ట్ టు పోలీసు వాచ్ అనే ఆష్షన్ ద్వారా మీరు రాసుకున్న రిజిస్ట్రేషన్ ఐడీను ఎంటర్ చేసి ఎన్ని రోజులు మీ ఇంటిపై పోలీసుల నిఘా అవరసమో ఆ తేదీ నుంచి సమయాన్ని ఎంపిక చేసుకోవాలి. మీ రిక్వెస్టును అందుకున్న కడప పోలీసులు మీ ఇంటికి వచ్చిన ఎల్‌హెచ్‌ఎంఎస్ సీసీ కెమెరాను ఉచితంగా ఏర్పాటు చేసి దానిని పోలీసు కంట్రోల్ గదికి యాప్‌కు అనుసంధానం చేస్తారు.

ఈ పరికరం మీ ఇంటిలో అమర్చిన తరువాత దొంగ ఇంటిలోకి ప్రవేశిస్తే వెంటనే పోలీసు కంట్రోల్ గదికి అలారం శబ్ధం రావడంతో పాటు దొంగలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు రికార్డు చేసి పంపుతుంది. ఇదీ గమనించిన పోలీసులు వెంటనే స్థానిక గస్తీ పోలీసులను చోరీ జరుగుతున్న ఇంటి వద్దకు పంపిస్తారు. అప్పుడు పోలీసులు దొంగలను పట్టుకునే అవకాశం ఉంఉంది. ప్రజలందరూ మీ ఇళ్లలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా కడప పోలీసులు మీకు అందిస్తున్న ఈ ఉచిత సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ విధానం ఇది వరకే అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని ప్రజలు వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా మన జిల్లా కూడా చోరీలు తగ్గుముఖ పడుతాయి.

# పోపులపెట్టెలో ఆరోగ్యం



మనలో పోపుల పెట్టె గురించి తెలియని వాళ్ళుండరు. మనం చిన్నప్పుడు పోపుల పెట్టెలో అమ్మ దాచుకున్న డబ్బులు నొక్కేయడం దగ్గర నుంచి మన జీవితంలో పోపుల పెట్టె పరిచయం అవుతుంది. మన పూర్వీకులు మన వంటింట్లో ఏమేం ఉండాలో అవన్నీ ఒక పెట్టెలో ఉంచడం సాంప్రదాయం పెట్టారు. అంతే కాదు మనం పోపుల పెట్టె తీయగానే అందులో నుంచి వచ్చే వాసనే సగం మన రోగాలను నయం చేస్తుందట. ఇక తింటే మనం డాక్టర్‌కు దూరంగా ఉండవచ్చు. అసలు మన పోపులపెట్టెలో ఏమేం ఉంటాయో వాటి వల్ల ఉపయోగాలు తెలుసుకుందాం.

**1.ఆవాలు:**

ఆవాలు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరానికి కావలసిన విటమిన్లు వీటిలో ఉన్నాయి. కీళ్ళనొప్పులు, కండరాల నొప్పులు తగ్గిస్తుంది. శ్వాస అవరోధాలను దూరం చేస్తుంది.

**2.జీలకర్ర:**

జీర్ణశక్తిని బాగా పెంచుతుంది. దీనిలోని క్యూమిక్ డీహైర్ అనే పరిమళం లాలాజల గ్రంధులను క్రియాశీలం చేస్తుంది. ఆకలిని పుట్టిస్తుంది. శ్వాసక్రియ వ్యవస్థను ఎలాంటి అంటురోగాలు సోకకుండా ఆరోగ్యంగా వుంచుతుంది.

**3.అల్లం:**

అజీర్ణ వ్యాధులకు అల్లం అద్భుతంగా పనిచేస్తుందని, ఉదర సంబంధ వ్యాధులకు అల్లాన్ని మించిన ఔషధం లేదని ఆయుర్వేదం గట్టిగా చెబుతోంది. వికారం, వాంతులు, విరోచనాలకు చెక్ పెడుతుంది. గర్భవతులలో ఉదయం పూట వికారాన్ని, కెమోథెరపీతో పాటు ఎన్నో కారణాలవలన వచ్చే కడుపునొప్పిని అల్లం నివారిస్తుంది.

**4.పసుపు:**

ఇక పసుపు గురించి చెప్పనవసరం లేదు. పసుపు యాంటి బయాటిక్ అని మనం ఎంతో నమ్మే విదేశీ శాస్త్రవేత్తలు కూడా చెప్పారు. పసుపు రక్త శుద్ధికి, కాలేయం, కంటి వ్యాధులకు, గాయాలు మానుటకు, వాపులతో కూడిన నొప్పులకు ఇలా ఎన్నో వాటికి ఔషధంలలో వాడతారు.

గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు పొడి వేసి ఉదయం, సాయంత్రం తాగితే జలుబు త్వరగా తగ్గుతుంది. పసుపును నీటిలో కలిపి ముద్ద చేసి లేదా లేత వేపాకు గుజ్జుతో కానీ కలిపి చర్మంపై రాస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. బెణికినప్పుడు నొప్పికి, గాయాలకు, కీళ్లవద్ద కొంచెం వాపు, నొప్పికి సున్నం, పసుపు కలిపి తేలికగా రుద్దితే మంచి ఉపశమనం కలుగుతుంది.

**5.వెల్లుల్లి:**

పచ్చివెల్లుల్లి తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కీళ్ళనొప్పుల్ని తగ్గిస్తాయి. ఆక్సీకరణ నుంచి శరీరంలోని కొవ్వును నివారించే కార్పినోజెనిక్ మిశ్రమ పదార్థాలు ఏర్పడే యాంటీ ఆక్సిడెంట్ ఇందులో మెండుగా వున్నాయి.

**6.దాల్చిన చెక్క:**

దాల్చిన చెక్కలో ప్రొటీన్లు, పీచు, ఐరన్, సోడియం, విటమిన్ సి ఇంకా ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. దీనిలోని ఔషధ విలువల వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిపై ప్రభావం చూపుతూ, కొలెస్టాల్, ట్రైగ్లిసెరైడ్ స్థాయిని తగ్గిస్తుందని అధ్యయనాలు పేర్కొంటు న్నాయి.




**7.లవంగాలు:**

లవంగాలలోని యాంటీ బాక్టీరియల్ గుణాలు దంత రక్షణనిస్తాయి. నోటిని, శ్వాసను తాజాగా వుంచుతాయి. హృదయానికి ఆరోగ్యాన్నిస్తాయి. యాంటిసెప్టిక్, యాంటీబయోటిక్ ఔషధాలలో లవంగాలను ఉపయోగిస్తారు.

**8.నల్లమిరియాలు:**

ఘాటుగా వుండి నాలుకను చురుక్కుమనిపించే మిరియాలు జీర్ణక్రియకు తోడ్పడతాయి. ఆహారం తేలికగా జీర్ణం కావడానికి హైడ్రోక్లోరిక్ యాసిడ్ను విడుదల చేయమని ఉదరాన్ని ప్రేరేపిస్తాయి. బ్లాక్ కాఫీలో మిరియాలపొడి వేసుకుని తాగితే ఋతుక్రమ సమయంలో ఇబ్బందుల నుంచి ఉపశమనం ఇస్తుంది.

**9.కుంకుంపువ్వు:**

ఇది చాలా ఖరీదైన సుగంధ ద్రవ్యం. దేశ విదేశాలలో ఆహార పదార్థాలలో రుచి, రంగు, సువాసనకోసం వాడే కుంకుమపువ్వులో క్యాన్సర్ నిరోధక గుణాలు వున్నాయి.

**10.ఏలకులు:**

ఊపిరితిత్తులలో కఫాన్ని కరిగించి, శ్లేష్మాన్ని తొలగించే శక్తి ఏలకులకు ఉంది. శ్వాస సంబంధిత ఇబ్బందులతో బాధపడే పిల్లలకు ఏలకులు వేసిన పాలను తాగించాలి. ఇవి జీర్ణక్రియ వ్యవస్థపై చక్కగా పనిచేస్తుంది. అజీర్ణం, కడుపు ఉబ్బరాన్ని తొలగిస్తుంది.

**11.మినపప్పు:**

మినపప్పు వెన్ను పూసకు బలాన్నిస్తుంది. అంతే కాదు మినపప లో ఉండే విటమిన్లు, ప్రొటీన్స్ శరీరానికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. ఎముకల బలానికి ఇవి ఉపయోగ పడతాయి.

**12.మెంతులు:**

మెంతులు మనందరికీ తెలిసిన ఔషధ దినుసు. ఇది శరీరంలో వేడిని ఉత్పన్నం చేసే ఒక చక్కని ఓషధి. కఫాన్ని వాతాన్ని తగ్గిస్తుంది.

మెంతులు మలబద్ధకం, అధిక కొలెస్టరాల్, షుగర్ వ్యాధి, అధిక బరువు సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. ప్రత్యేకమైన వాసన, శరీరాన్ని పోషించే తత్వం ఈ లక్షణాల వల్ల ఇది అతి ప్రభావవంతమైన, విలువైన ఓషధిగా ప్రసిద్ధి గాంచింది.

# బిర్యానీలో కూడా!




బ్రెడ్ తయారీలో రసాయనాల మోతాదు ఎక్కువగా ఉంటున్నాయని, వాటివల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిన్న మొన్నటి వరకు గగ్గోలు పుట్టింది. ఆ విషయాన్ని మరువక ముందే ప్రజలందరూ బాగా ఇష్టపడే బిర్యానీలో కూడా రసాయనాలు కలుపుతున్నట్లు తేలింది. దీనిపై స్పందించిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సత్వర విచారణకు ఆదేశించింది. బిర్యానీ తయారీలో సింథటిక్ రసాయనాలను వాడుతున్నట్లు కోల్ కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎమ్ సీ) అధికారులు నిర్ధారించారు. నగరంలో వివిధ రెస్టారెంట్లు, హోటళ్లలో సేకరించిన బిర్యానీలపై నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక శాతం కేన్సర్ కారకంగా భావించే మెటానిల్ ఎల్లో అనే పదార్థం ఉన్నట్లు తేలిందని అధికారులు తెలిపారు. బిర్యానీలో బియ్యం పసుపు రంగులోకి మారడానికి సాధారణంగా కుంకుమపువ్వును ఉపయోగిస్తారని కానీ, యజమానులు మెటానిల్ ఎల్లో అనే రసాయనం వాడుతున్నట్లు గుర్తించామని వివరించారు. దీన్ని సాధారణంగా పారిశ్రామిక అవసరాలకు ఉపయోగిస్తారు. కుంకుమ పువ్వుతో పోలిస్తే మెటానిల్ ఎల్లో ధర తక్కువ కావడం వల్లే రోడ్డు మీద అమ్మే వారి నుంచి హోటళ్ల వరకు దానిని ఉపయోగించడానికి ఆసక్తి చూపుతున్నట్లు ఫుడ్ టెక్నాలజీ నిపుణులు తెలిపారు. కాగా, బ్రెడ్, బన్, పావ్ బాజీ, పిజ్జా తదితర బేకరీ ఐటమ్స్‌లో రసాయనాలను అధికమోతాదులో ఉపయోగిస్తున్నట్లు సర్వేలో తేలడం ఇప్పటికే కోల్ కతా మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. తాజాగా బిర్యానీల్లో కూడా రసాయనాల వినియోగిస్తుండటంతో రాష్ట్ర ఆహార సంస్థకు ఈ విషయమై నివేదికను పంపింది. రసాయనాలు కలిపిన బిర్యానీని తయారుచేస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ఇందుకుగాను న్యాయసలహాలను కోరింది.

దోమకాటువల్ల వ్యాప్తి చెందే జికా వైరస్... ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తోంది. ముఖ్యంగా జికా వైరస్ అమెరికాలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ హెచ్చరిస్తోంది. ఇప్పటికే బ్రెజిల్ లో దాదాపు పది లక్షలమందికి జికా సోకి కలకలం రేపడమే కాక మెల్లగా ఇతర ఖండాలకూ విస్తరిస్తోంది. ఈ

# గర్భం వాయిదానే ఉత్తమ మార్గం..!

వైరస్ గర్భిణులకు సోకితే పుట్టబోయే పిల్లలకు మెదడు లోపాలు తలెత్తే అవకాశం పెద్ద ఎత్తున ఉండటంతో డబ్ల్యూ హెచ్ వో వైరస్ ను నిలవరించేందుకు భారీ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా వైరస్ వ్యాప్తి చెందుతున్న దేశాల్లోని మహిళలు గర్భధారణను ప్రస్తుత సమయంలో వాయిదా వేసుకోవడం మంచిదని హెచ్చరిస్తోంది. పిల్లల పుట్టుకలో లోపాలను నివారించడానికి వ్యాక్సిన్లకు బదులుగా ఈ పద్ధతిని పాటించడం ఉత్తమ మార్గమని చెప్తోంది. జికా వైరస్ సోకిన వెంటనే సాధారణ ప్రజల్లో లక్షణాలు పెద్దగా కనిపించకపోయినా గర్భిణులపై మాత్రం ఈ వైరస్ ప్రభావం అత్యధికంగా ఉంటోంది. జికా తల్లికి పుట్టిన బిడ్డ మెదడులోపంతో ఉండటం ప్రపంచ ఆరోగ్యసంస్థకు పెద్ద సవాలుగా మారింది. దీంతో మహిళలకు ముందు జాగ్రత్త చర్యలను సూచిస్తున్నారు. గర్భం ధరించాలనుకున్న వారు జికా వ్యాప్తి చెందుతున్న సమయంలో వాయిదా వేసుకోవాలని, వ్యాక్సిన్లు వేసినప్పటికీ జికా తల్లులకు పుట్టే బిడ్డలు మెదడు లోపాలతో పుట్టే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే జికా వ్యాప్తి చెందిన అన్ని దేశాల్లో హెచ్చరికలను జారీ చేసిన నిపుణులు.. లైంగిక కార్యకలాపాల వల్ల అనుకున్నదానికంటే ఎక్కువగా వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పుట్టే పిల్లల్లో మైక్రో సెఫిలి నివారించాలంటే గర్భాన్ని వాయిదా వేసుకోవడమే సరైన మార్గమని హెచ్చరిస్తున్నారు. ఈడిస్ ఈజిప్టె రకం దోమలు కుట్టడంద్వారా జికా సంక్రమిస్తుందని మొదట్లో తెలిసినా... లైంగిక కార్యకలాపాలు, ముద్దులు, తినే వస్తువులు మార్పిడితో లాలాజలం వల్ల కూడ జికా ఒకరినుంచీ ఒకరికి సోకే అవకాశం ఉందని తాజా పరిశోధనలద్వారా కనుగొన్నారు. దీంతో కొన్ని దిద్దుబాట్లను చేసిన ఏజెన్సీలు... జికా ప్రభావిత ప్రాంతాల్లో కొత్త మార్గదర్శకాలను విడుదల చేశారు. ఇందులో భాగంగా పునరుత్పత్తి వయసులోని పురుషులు, మహిళలు గర్భధారణ జరగకుండా చూసుకోవాలని, వాయిదా వేసుకోవడం అన్నిరకాలుగా మంచిదని చెప్తున్నారు.



# సుఖవంతమైన నిద్రతో ఆరోగ్యం

నిద్ర సుఖమెరగదు. ఎక్కడ పడుకుంటే ఏం అనుకునే వాళ్ళ సంఖ్యం ఎక్కువే కానీ ఎలా పడితే అలా పడుకుంటే ఉన్న నిద్ర కాస్త ఎగిరిపోతుంది. పరిసరాలను మైమరచి కునుకు తీయాలంటే మెత్తని పరుపు ఉండాల్సిందే. ఆదమరచి నిదురపోవడంలో ఉండే ఆనందం అంతా ఇంతా కాదు. పానుపు మెత్తగా ఉండే సౌకర్యంగా ఉంటే ఇక మీ ఇంట్లో టీవీ చుట్టూ ఎవరూ చేరరు. అంతా మంచంమీదే కబుర్లు చెప్పుకుంటారు.

అంత మహిమ గల పరుపులు ఏమున్నాయనేగా మీ సందేహం! దూది పరుపులు, పీచు పరుపుల స్థానానే ఇప్పుడు మార్కెట్‌లో టెక్నాలజీ పరుపులు సిద్ధమై వూరిస్తున్నాయి. పడుకోగానే మెత్తగా కూరుకుపోయే మెమెరీ ఫోమ్ పరుపులొచ్చాయి. మేఘాలలో తేలిపోతున్న అనుభూతినిచ్చే లాటెక్స్ పరుపులున్నాయి. ఎలా కావాలంటే అలా మనల్ని ఒదిగిపోయేలా చేసే ఎలక్ట్రిక్ పరుపులొచ్చాయి. నిజంగానే గాలిలో తేలేలా చేసే గాలి పరుపులూ ఉన్నాయి.

**మీరు మెచ్చేట్లు..**

మీకు ఎలాకావాలంటే అలా ఒదిగిపోయే పరుపు కావాలంటే మెమొరీ ఫోమ్‌ని ఎంచుకోవాల్సింది. మీ బరువు ఆకారాన్ని బట్టి పరుపు దానంతట అదే అడ్జెస్ట్ అవుతుంది.అంతేకాకుండా ఇది ఉష్ణోగ్రతకు అనుగుణంగా మార్పులు చెందుతుంది. ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద సాఫ్ట్‌గాను తక్కువ ఉష్ణోగ్రత వద్ద గట్టిగాను మారుతూ ఉంటుంది. అంటే మీ బాడీ టెంపరేచర్, మీ శరీరాకృతి, బరువులను బట్టి మీకు సౌకర్యంగా తన రూపును మార్చుకుంటుంది. ఇది నిజంగా ఒక అద్భుత సృష్టి అనే చెప్పాలి. దీనివల్ల చాలా లాభాలు కూడా ఉన్నాయి.ఈ ఫోమ్ బెడ్ మీద ఎంత మంది పడుకున్నా అందరికీ కమ్‌ఫర్టగా ఉంటుంది. సాధారణంగా భార్యాభర్తలు పడుకున్నపుడు ఇద్దరి బరువూ ఒకేలా ఉండదు కనుక ఇద్దరిలో ఎవరో ఒకరు కదులుతూనే ఉంటారు. ఇది మరొకరికి విసుగ్గా ఉంటుంది. ఈ మెమొరీ బెడ్ పై పడుకుంటే ఈ సమస్యలే ఉండవు. ఎందుకంటే ఎవరి బరువుకు తగ్గట్టు వారి ఆకృతి ఏర్పడిపోతుంది కనుక. చాలా మంది నిద్దర్లో మెడ పట్టేసింది, నడుం పట్టేసిందని అంటుం టారు. కాని ఈ ఫోమ్ మీ మెడ, నడుంనొప్పులను ఇట్టే తీసేస్తుంది.వెన్నుముకకు మంచిది. మొత్తానికి ఇది మీ తలనుండి కాళ్ళ వరుకు ఎంతో సపోర్టింగ్‌గా ఉం టుంది. ఇన్ని సౌకర్యాలు ఉన్న ఈ బెడ్ చాలా ఖరీదేమో అనుకోకండి. సామాన్యులకు కూడా దీని ధర అందుబాటులోనే ఉంది.

**మీ వెంటే**

మూవింగ్ బెడ్‌పైపై పడుకుంటే బంతిలా ఎగురుతారు.దీనిలో స్ప్రింగ్ లు ఉండవు కాని బౌన్స్ అవుతారు. దీనిలో ఎక్కువ పొరలు ఉండడం వలనే ఇది ఇంత మెత్తగా ఉండడానికి కారణం.గదిలోని ఉష్ణోగ్రతను బట్టి దాని తత్వాన్ని మార్చుకుంటుంది.ఇది చాలా తేలికగా ఉండడం వలన ఎక్కడికైనా తీసుకువేళ్ళే అవకాశం ఉంటుంది. నిద్రలేమితో బాధపడుతున్న వారికిది సరైన మందు. డాక్టర్లు కూడా వీటినే వాడమని చెబుతున్నారు. ఏఏమైనా సర్జరీలు చేయించుకున్న వాళ్ళకి చేయించుకునే వాళ్ళకి ఇది చాలా సౌకర్యంగా ఉంటుంది. శరీరంలోని అన్ని భాగాలకు రక్త ప్రసరణ బాగా జరిగేవిధంగా చేస్తుంది. నిద్రలో ఉన్నపుడు శ్వాస తీసుకోవడంలో ఏమైనా సమస్యలున్నా ఈ అడ్జస్టబుల్ బెడ్ వలన ఉపశమనం కలుగుతుంది.

**ఎయిర్ బెడ్**



ఒకసారి ఈ బెడ్‌పై పడుకుంటే మరే బెడ్‌పై పడుకోడానిక ఇష్టపడరు. ఈ బెడ్ మొత్తం ఖరీదైన యాంటీ మైక్రో బయల్ కాటన్‌తో కప్ప బడి ఉంటుంది. దీని అడుగు భాగంలో గ్రిప్‌టైట్ నాన్ స్లిప్ అమర్చి ఉంటుంది. బెడ్‌ని శుభ్రం చేసుకునేటప్పుడు ఈ కవర్‌ను తీసేయొచ్చు. ఇది గాలితో నిండి ఉండేది కనుక గదిలో ఎక్కడ కావాలంటే అక్కడ సులువుగా దీనిని పెట్టుకోవచ్చు. ఈ బెడ్ పై మీరు ఎలా పడుకోవలనుకుంటే అలా మీకు అనుగుణంగా ఉంటుంది. మెడ, నడుము నొప్పులకు ఇక టాటా చెప్పేయొచ్చు.

**సొంతింటి మసాజ్**

దీని పేరు కంట్రోల్ బెడ్. ఇది మీ తల నుండి కాలి వరుకు మీకు ఎన్ని వందల రకాల మలుపులు తిప్పాలనుకుంటే అన్ని రకాల ఆకారాలలో పెట్టుకోవచ్చు. ఇదంతా ఒక చిన్న కంట్రోల్‌తో సాధ్యం. మీబెడ్‌కి ఒక సందేశం ఇచ్చిశరీరానికి మసాజ్ చేయిం చుకోవచ్చు. వైర్‌లెస్ చేతి రిమోట్ ద్వారా ఈ సందేశాలన్నీ ఇవ్వొచ్చు. ఈ ఎలక్ట్రికల్ సామాగ్రి అంతా బెడ్ అడుగు భాగంలో అమర్చబడి ఉంటుంది.

# చెవి కాస్త పదిలం

చెప్పులోని రాయి... చెవిలోని జోరిగ పెట్టే ఇబ్బంది అంతా ఇంతా కాదని అంటుంటారు కానీ కొన్ని సార్లు ఏ జోరీగా లేకపోయినా ఏదో తిరుగుతున్నట్టుగా మెదడులో రొద భరించతరం కాదు. ఒక్కోసారి చెవిలో దురదతో ఏమీ తోచదు. మరే పనిమీద మనసు కుదరదు. ఇలాంటి సమస్యలు చిన్నవే కానీ.... కానీ ఇవి కలిగించే ఇబ్బంది అది ఎదుర్కొంటున్న వారికే అర్థమవుతుంది. దీపావళి పండగ వెలుగుల పండగ మాత్రమే కాదు టపాసుల పండగ కూడా. టపాసుల శబ్దాలు కూడా ఉంటాయి. వీటి వల్ల కూడా చెవికి నష్టం జరగవచ్చు. దీని గురించిన కొద్ది పాటి అవగాహన.....

చెవిలో దురద వల్ల మరే పని తోచదు. ఇలా చాలా ఇబ్బంది పెట్టే చెవిలో దురదకు కారణం చాలాసార్లు చెవిలోని చర్మం పొడిబారడమయి ఉంటుంది. కొన్ని సార్లు ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా కావచ్చు. అది ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయితే దురదతో పాటు చెవి నుంచి స్రావాలు కూడా వస్తుంటాయి.

-ఆటైటిస్ మీడియా - అంటే మధ్య చెవిలో నీరు చేరడం. ఇలా మధ్య చెవిలో నీరు చేరడం వల్ల చెవిలో దురదగా ఉంటుంది.

-సొరియాసిస్ వల్ల కూడా చెవిలో దురద రావచ్చు. ఒక్కోసారి సొరియాసిస్ చెవిలోపలే ప్రారంభం కావచ్చు.

-చెవిలో చుండ్రు చేరడం వల్ల కూడా చెవిలో దురద వచ్చే అవకాశాలున్నాయి. ఎందుకంటే చెవిలోపలి చర్మం, తల పై ఉండే చర్మం ఒకే విధమైనవి. చాలా సందర్భాల్లో తలలో కూడా చుండ్రు ఉన్నపుడే చెవిలోనూ చుండ్రు చేరుతుంది కానీ కొన్ని సార్లు కేవలం చెవిలో మాత్రమే కూడా చుండ్రు ఉండవచ్చు.

-చెవిలో వ్యాక్స్ ఎక్కువగా పోగుపడిపోవడం కూడా దురదకు కారణం అవుతుంది.

-సాధారణంగా దురద దానంతటదే తగ్గిపోవాలి. అలా తగ్గడం లేదంటే తప్పనిసరిగా డాక్టర్‌ని కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. పొడి చర్మం వల్ల దురదగా ఉన్న వారికి చర్మంలో తేమ నిలిపి ఉంచేందుకు క్రీములు, చెవిలో తడి ఎక్కువగా ఉండడం వల్ల లేదా ఇన్‌ఫెక్షన్ వల్ల దురద వచ్చేట్టయితే డ్రాప్స్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని డాక్టర్ సలహాతో వాడడం వల్ల దురద నుంచి విముక్తి పొందవచ్చు. లేదా మరే ఇతర కారణంతోనైనా దురద వస్తుంటే దానికి చికిత్స తీసుకోవడం ద్వారా చెవిలో దురద తగ్గిపోతుంది.

**శబ్దాలు**

కొంత మందికి చెవిలో నిరంతరంగా ఏదో ఒక శబ్దం వినిపిస్తున్నట్టుగా ఉంటుంది. ప్రశాంతంగా ఉన్న సమయాల్లో, నిద్రలో ఈ శబ్దాలు ఎక్కువగా ఉన్నట్టుగా అనిపిస్తుంది. వీటి వల్ల జీవితంలో ప్రాశాంతత లోపించిన భావన కలుగుతుంది. అయితే ఇలా చెవిలో శబ్దాలు రావడానికి చాలా కారణాలుంటాయి. మెదడులో శ్రవణ నాడికి పైన చెవికి శ్రవణ నాడికి మధ్య భాగంలో ఉండే కాక్లియాలో ఉండే ఎయిర్ సెల్స్‌లో వచ్చే తేడాల వల్ల ఇలా చెవిలో రణగొణ ధ్వనులు రావచ్చు. ఇలా చెవిలో శబ్ధం రావడాన్ని టినిటస్ అంటారు.

మన మెదడు ఒకసారి ఒకే శబ్ధాన్ని స్పష్టంగా గ్రహించగలుగుతుంది. మరేదైనా ఇతర శబ్ధాల మీదకు దృష్టిని మళ్లించడం ద్వారా వీటి నుంచి విముక్తి పొందవచ్చు. లేక ఇది భరించడం ఇబ్బందిగా ఉన్న వారికి టినిటస్ మాస్టర్ అనే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మెదడు ఒకే శబ్ధాన్ని గ్రహించగలుగుతుంది కాబట్టి అతి తక్కువ ఫ్రీక్వెన్సీలో వైట్ నాయిస్‌ను మెదడుకు చేరవేస్తుంది. అందువల్ల మెదడు చెవిలో ఏర్పడుతున్న ధ్వనిని గుర్తించదు అందువల్ల శబ్ధాలు తగ్గిపోయిన భావన కలుగుతుంది.

ఇలా శబ్ధాలతో పాటుగా కళ్లు తిరగడం, తలనొప్పి, వినికిడి తగ్గడం, వాంతుల వంటి లక్షణాలుంటే మాత్రం వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇలాంటి సందర్భాలు మరేదైనా ప్రమాదరకరమైన స్థితి లక్షణం కావచ్చు. కాబట్టి ఎందుకు ఇలాంటి శబ్ధాలు వస్తున్నాయనే విషయాన్ని తప్పనిసరిగా నిర్ధారించు కోవాల్సి ఉంటుంది.

**నొప్పి**

చెవిలో నొప్పి భరించతరం కానీ విధంగా ఉంటుంది. చెవిలో నొప్పి రావడానికి చాలా కారణాలున్నాయి.

-చెవిలో ఇన్‌ఫెక్షన్ రావడం

-చెవిలో ట్యూమర్లు ఏర్పడడం

-దవడ కీలులో ఏదైనా చిన్న సమస్య వచ్చినా కూడా చెవిలో నొప్పి రావచ్చు

-పంటి నొప్పి వల్ల కూడా చెవిలో నొప్పి రావచ్చు

-ముక్కు వెనుక భాగంలో వచ్చే క్యాన్సర్ వల్ల కూడా చెవిలో నొప్పి రావచ్చు.


-చెవిలో పాలిప్స్ ఏర్పడినపుడు, టాన్సిల్స్‌లో ఇన్‌ఫక్షన్, హైస్టెలాల్జియా అనే నాడిలో వచ్చే సమస్య వల్ల కూడా చెవిలో నొప్పి వస్తుంది.

-చెవిలో నొప్పి ఏ కారణంతో వస్తుందో నిర్ధారణ చేసుకొని దానికి చికిత్స అందించడం ద్వారా చెవి నొప్పిని దూరం చేసుకోవచ్చు.

**కొన్ని జాగ్రత్తలు..**

టపాసుల నుంచి వచ్చే పెద్దపెద్ద శబ్ధాల వల్ల పిల్లలు, వృద్ధులు, గర్భవతుల్లో అవాంఛనీయమైన పరిణా మాలకు కారణం కావచ్చు. కాబట్టి వీరు టపాసులకు దూరంగా ఉండడమే మంచిది.

కేవలం శబ్ధాలు మాత్రమే కాదు వాటి నుంచి వెలువడే పొగ వల్ల అలర్జీలు కూడా రావచ్చు. ఇవి కళ్లు, ముక్కు, చెవి, గొంతు ఆరోగ్యాలకు హానికరం కావచ్చు. వీలైనంత వరకు బాణాసాంచా కాల్చకపోవడమే ఆరోగ్యానికి మంచిది.



# చిత్రభాను



## ప్రత్యేక శిక్షణ కోసం.. అల్లు అర్జున్

ప్రతి సినిమాలో నటుడిగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకునేందుకు తపిస్తుంటారు అల్లు అర్జున్. పాత్ర ఏదైనా అందులో వందశాతం ఇమిడిపోతుంటారు. ఇటీవల విడుదలైన డీజే దువ్వాడ జగన్నాథం చిత్రంలో బ్రాహ్మణ యువకుడిగా సహజ అభినయంతో ఆకట్టుకున్నారాయన. తన తదుపరి సినిమాకు సంబంధించి శారీరక శిక్షణ కోసం ఆయన అమెరికా వెళ్లనున్నారు. వివరాల్లోకి వెళితే. బన్నీ కథానాయకుడిగా వక్కంతం వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా. ఈ సినిమాలో అల్లు అర్జున్ మిలటరీ అధికారిగా కనిపించబోతున్నారు. పాత్రకు తగినట్లుగా తన దేహాన్ని తీర్చిదిద్దుకోవడం కోసం ఆయన అమెరికాలో ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారు. వ్యాయామాలు, జిమ్ కోసమే ఎక్కువ సమయం కేటాయించనున్నట్లు తెలిసింది. ఫిట్‌నెస్ కోసం డైట్ విషయంలో ప్రత్యేకంగా ఓ శిక్షకుడిని నియమించుకోనున్నట్లు సమాచారం. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా కొత్త లుక్‌తో అల్లు అర్జున్ ఈ సినిమాలో కనిపించబోతున్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అను ఎమ్మాన్యుయేల్ కథానాయికగా నటించనున్న ఈ సినిమాలో అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీషా, శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## రిక్షా తొక్కిన రకుల్!

రామ్‌చరణ్ నటించిన ధ్రువ చిత్రం కోసం ప్రత్యేక ఆహార నియమాల్ని పాటించి వృత్తిపట్ల తన నిబద్ధతను చాటుకున్న ఢిల్లీ సోయగం రకుల్ ప్రీత్‌సింగ్ ప్రస్తుతం నటిస్తున్న ఓ తమిళ సినిమా కోసం అదే పంథాను అనుసరించినట్లు తెలిసింది. అనతి కాలంలోనే క్రేజీ కథానాయికల జాబితాలో చేరిపోయిన రకుల్ ప్రస్తుతం కార్తి కథానాయకుడిగా తెరకెక్కుతున్న ధీరన్ అధికారం ఒంద్రు అనే తమిళ చిత్రంలో నటిస్తున్నది. కార్తి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం పుదుచ్చేరిలో జరుగుతున్నది. కాగా ఈ చిత్రంలోని ఓ పాటలో రకుల్ రిక్షా తొక్కే సన్నివేశం వుందట. అందు కోసం ఆమె రిక్షా తొక్కడం నేర్చుకుందని తెలిసింది. రకుల్ రిక్షా తొక్కడం ప్రాక్టీస్ చేస్తుండగా తీసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె మాట్లాడుతూ ఏది చేసినా సహజంగా వుండాలని తపిస్తుంటాను. అందుకే కార్తితో కలిసి నటిస్తున్న చిత్రంలోని ఓ సన్నివేశం కోసం రిక్షా తొక్కడం నేర్చుకున్నాను. చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. పుదుచ్చేరిలోని వీధుల్లో రిక్షా తొక్కడం సరికొత్త అనుభూతినిచ్చింది అని పేర్కొంది. రకుల్ ప్రస్తుతం స్పైడర్, జయ జానకి నాయక చిత్రాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే.





## గల్ఫ్ ఓ లైబ్రరీగా నిలుస్తుంది!

మంచి సినిమాగా గల్ఫ్ చాలా కాలం పాటు నిలిచిపోతుంది. గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి ఈ సినిమా ఒక లైబ్రరీగా ఉపయోగపడుతుంది అని అన్నారు దర్శకుడు మారుతి. శ్రావ్య ఫిలింస్ పతాకంపై పి. సునీల్‌కుమార్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం గల్ఫ్ చేతన్ మద్దినేని, డింపుల్ జంటగా నటిస్తున్నారు. యక్కలి రవీంద్రబాబు, ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రవీణ్ ఇమ్మది స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు మంగళవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. దర్శకుడు మారుతి ఆడియో సీడీలను ఆవిష్కరించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ సామాజిక సమస్యలను చర్చించడంలో తెలుగు చిత్రసీమలో సునీల్‌కుమార్‌రెడ్డి ముందుంటారు. లాభనష్టాల గురించి ఆలోచించకుండా నిజాయితీగా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తుంటారు. ఈ సినిమా కోసం ఆయన పడిన కష్టం తెరపై కనిపిస్తున్నది అని తెలిపారు. నా ఇంట్లో ఉన్న నాలుగు నంది పురస్కారాల్లో రెండు సునీల్‌కుమార్‌రెడ్డి దర్శకత్వంలో వచ్చిన సొంతవూరు సినిమాకు అందుకున్నానని, ఎంతో పరిశోధన చేసి ఆయన ఈ సినిమాను రూపొందించారని ఎల్‌బీ శ్రీరాం చెప్పారు.



## నా నిజజీవితానికి దగ్గరగా

**నా నిజజీవితానికి దగ్గరగా ఉండే పాత్రను గౌతమ్‌నంద చిత్రంలో పోషిస్తున్నాను అని చెప్పింది కేథరీన్. పైసా, రుద్రమదేవి, ఇద్దరమ్మాయిలతో, సరైనోడు చిత్రాలతో తెలుగులో చక్కటి గుర్తింపును సొంతం చేసుకుందీ సుందరి. ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం గౌతమ్‌నంద. సంపత్‌నంది దర్శకుడు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా కేథరీన్ చెప్పిన ముచ్చట్లివి...**

తెలుగులో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకోవాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. నా తపన గమనించిన దర్శకుడు క ృష?వంశీ పైసా సమయంలో డబ్బింగ్ చెప్పే అవకాశం ఇచ్చారు. అప్పటికీ తెలుగుభాషపై సరైన పట్టు లేకపోవడంతో రెండు రోజులు ప్రయత్నించి మిన్నకుండిపోయాను. ఆ తర్వాత ఇద్దరమ్మాయిలతో సమయంలో కుదరలేదు. డబ్బింగ్ చెప్పుకోవాలనే కోరిక ఇన్నాళ్లకు గౌతమ్‌నందతో తీరింది. సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్నప్పుడే పాత్రలు తెరపై సహజంగా కనిపిస్తాయి.

**గ్లామరస్‌గా కనిపిస్తా.**

ఈ చిత్రంలో నా పాత్ర పేరు ముగ్ధ. తనకంటూ కొన్ని నిర్ధిష్టమైన అభిప్రాయాలు కలిగిన ధైర్యవంతురాలైన అమ్మాయిగా నా పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. అభినయానికి ఎక్కువగా ఆస్కారముంటుంది. నా నిజజీవితానికి దగ్గరి పోలికలు ఉంటాయి. గత సినిమాలతో పోలిస్తే ఇందులో గ్లామరస్‌గా కనిపిస్తా. నా కెరీర్‌లో ఎక్కువగా ఇద్దరు హీరోయిన్ల సినిమాల్లో నటించే అవకాశాలే వస్తున్నాయి. అందుకు కారణమేమిటో నాకు తెలియడం లేదు(నవ్వుతూ). గోపీచంద్ సినీ జీవితంలో ట్కాస్టైలిష్ చిత్రమిది. హీరోయిజాన్ని కాకుండా కథను నమ్మి దర్శకుడు సంపత్‌నంది ఈ సినిమాను రూపొందించారు. సంపత్‌నంది తన సినిమాల్లో పాటలను చాలా అందంగా చిత్రీకరిస్తుంటారు. ముఖ్యంగా వాన పాటల విషయంలో ఆయనది ప్రత్యేకమైన పంథా. వాటిలో నేను నటిస్తే బాగుంటుందని చాలా సార్లు అనుకునేదాన్ని. అది ఈ సినిమాకు కుదిరింది.

**బరువు తగ్గాను...**

నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తుంటాను. సరైనోడు తర్వాత ఓ సందరరేలో డ్యాన్స్‌లో మెళకువలు నేర్చుకుంటున్నప్పుడు క్లిష్టతరమైన కొన్ని స్టెప్పులు వేయలేకపోయాను. అందుకు కారణమేమిటా అని ఆలోచిస్తే బరువు ఎక్కువగా ఉండటమే అని అర్థమైంది. దాంతో బరువు తగ్గి ఈ సినిమాలో నటించాను.

**మూస ధోరణిని బ్రేక్ చేస్తా**

కథానుగుణంగానే నేనే రాజు నేనే మంత్రి సినిమాలో సిగరెట్ తాగే సన్నివేశాల్లో నటించాను. వ్యక్తిగతంగా నాకు అలాంటి అలవాట్లు లేవు. హీరోయిన్స్ అంటే మూస విధానంలో చూపించే ధోరణిని ఆ పాత్ర బ్రేక్ చేస్తుందనే నమ్మకం ఉంది. ప్రతినాయిక ఛాయలతో విభిన్నంగా సాగుతుంది.

నటిగా నన్ను సరికొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది.

**జీవితం ఎంతో విలువైంది...**

డ్రగ్స్ వ్యవహారం గురించి, అందుకు దారి తీసిన పరిస్థితుల పట్ల నాకు పెద్దగా అవగాహన లేదు. దేవుడు ప్రతి ఒక్కరిని పుట్టించడం వెనక ఏదో ఒక కారణం ఉంటుంది.

దానిని నెరవేర్చుకున్నప్పుడే జీవితం సార్థకం అవుతుంది. డ్రగ్స్ వల్ల విలువైన జీవితాన్ని వ ృథా చేసుకోవడం సరికాదు.

**అందుకే ఇక్కడే సెటిలయ్యా...**

హైదరాబాద్ నాకు ఎంతో నచ్చింది. ఇక్కడి ప్రజలు, వారి జీవన విధానం నన్ను చాలా ఆకట్టుకుంది. అందుకే ఇక్కడే ఇల్లు కొనుక్కొని సెటిలయ్యాను. నా ఊహలు, ఆలోచనలకు తగినట్లుగా ఇంటిని తీర్చిదిద్దుకున్నాను.

# సామాజిక సేవకు ముందుకొచ్చిన హెచ్‌సీఎల్

- రెండు జిల్లాల్లో కార్యక్రమాలు
- ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌తో సమావేశం



గుంటూరు: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సేవా కార్యక్రమాలు చేయనుంది. ఇందుకోసం గుంటూరు జిల్లా కలెక్టరు కోన శశిధర్‌ను ఇటీవలే కలిసి ఫౌండేషన్ ద్వారా చేపట్టే పనుల గురించి తెలియజేసి ప్రభుత్వ శాఖల ద్వారా తమకు అందజేయాల్సిన సహకారాన్ని కోరారు. దీంతో కలెక్టరు శశిధర్ ఆదేశాల మేరకు జిల్లాపరిషత్తు సీఈవో వెంకటసుబ్బయ్య హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు, జిల్లా అధికారులతో తన ఛాంబర్లో సమావేశమయ్యారు. గుంటూరు జిల్లాలోని రెండు మండలాలను ఫౌండేషన్ దత్తత తీసుకుని అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సంస్థ ద్వారా చేస్తామని ప్రతినిధి బృందం తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అవసరమైన పాఠ్య సామగ్రిని అందజేయటంతో పాటు వారికి డిజిటల్ విద్యా బోధన చేస్తామన్నారు. మాతా, శిశు మరణాలను నివారించేందుకు పోషకాహారం పంపిణీ చేస్తామని, రైతులు నూతన వ్యవసాయ విధానంలో సేద్యం చేసేలా ప్రోత్సహిస్తామని వివరించారు.

జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని వారికి సీపీవో శ్రీనివాస్ అందజేశారు. గ్రామీణ ప్రజల అభివృద్ధికి చేయనున్న పనులు, సంక్షేమ కార్యక్రమాలను సీఈవోకు తెలిపారు. జిల్లాలో అభివృద్ధిలో వెనుకబడి ఉన్న రెండు మండలాలను కలెక్టరు ఎంపిక చేసి ఫౌండేషన్‌కు సమాచారం ఇస్తారని సీఈవో వెంకటసుబ్బయ్య వెల్లడించారు. కృష్ణా జిల్లాలోనూ రెండు మండలాల్లో చేయనున్న కార్యక్రమాల గురించి కలెక్టరుతో ఇప్పటికే చర్చించారు. గురువారం వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, సమాచార, సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్‌తో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు సమావేశం కానున్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన అధికారులను సమావేశానికి ఆహ్వానించారు. మంత్రి లోకేశ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో రెండు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రజల అభివృద్ధికి చేయాల్సిన పనులపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని సీఈవో వెంకటసుబ్బయ్య వివరించారు.

సమావేశంలో జేడీఏ కృపాదాస్, డ్వామా పీడీ శ్రీనివాసులు, సీపీవో శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టరు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పించకపోతే ఇంటికే ..

అనంతపురం: పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి చూపాలి. క్షేత్ర స్థాయిలో రాజకీయాలు చేస్తే సహించేది లేదు. కూలీలందరికీ పనులు కల్పించాల్సిందే. సున్నా పనులు నమోదైతే సిమ్‌కార్డు స్వాధీనం చేసుకుని ఇంటికి పంపిస్తాం.. అంటూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ నాగభూషణం హెచ్చరించారు. పని దినాల నమోదులో చాలా వెనుకపడిన ఎఫ్‌ఏలను తన కార్యాలయానికి పిలిపించారు. ఈ ఏప్రిల్ మాసం నుంచి వారాల వారీగా ఎన్ని పని దినాలు కల్పించారు. ఎందుకు వెనుకపడ్డారని ఆరా తీశారు.

# మిథాలీ సేన ప్రపంచకప్ గెలిచినట్టే

- జట్టుకు బీసీసీఐ నజరానా అందజేత
- ఒక్కో క్రీడాకారిణికీ రూ. 50 లక్షల చెక్కు
- నాడు బేటీ బచావో, బేటీ పడావో.. నేడు బేటీ ఖేలియో
- క్రీడల మంత్రి విజయ్ గోయల్



దిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టుకు బీసీసీఐ గతంలో ప్రకటించిన నజరానాను గురువారం అందజేసింది. దేశ రాజధాని దిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సురేశ్ ప్రభు, బీసీసీఐ ప్రతినిధులు క్రీడాకారిణులకు చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో క్రీడాకారిణి రూ.50లక్షల చెక్కును అందుకుంది. ఇటీవల ఇంగ్లాండ్, వేల్స్‌లో ముగిసిన ప్రపంచకప్ ఫైనల్లో భారత్ ఆతిథ్య ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌పై ఘన విజయం సాధించి మిథాలీ సేన ఫైనల్‌కి చేరుకుంది. మిథాలీ సేన ప్రపంచ కప్ చేరుకోవడంతో బీసీసీఐ ప్రతినిధులు ఒక్కో క్రీడాకారిణికి రూ.50లక్షలు, సహాయ సిబ్బంది తలో రూ.25లక్షలు అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు గురువారం ప్రత్యేక కార్యక్రమం ద్వారా క్రీడాకారిణిలను సత్కరించి చెక్కులు పంపిణీ చేసింది.

అంతకుముందు క్రీడల మంత్రి విజయ్ గోయల్ మిథాలీసేనకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి ప్రత్యేక జ్ఞాపికలు బహుకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మన మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ టోర్నీలో అంచనాలకు మించి ప్రదర్శన చేసి రన్నరప్స్‌గా నిలిచింది. ప్రపంచకప్ ఫైనల్లో మన జట్టు ఫైనల్ గెలిచిందనే భావిస్తున్నాను. ఎందుకంటే ఫైనల్లో వారి పోరాట ప్రదర్శనతో దేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నారు కాబట్టి. వీరు యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ముఖ్యంగా దేశంలోని లక్షలాది మంది యువతులు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందుకు. రియో ఒలింపిక్స్ నుంచి పారా ఒలింపిక్స్ వరకు హాకీ, రెజ్లింగ్ బ్యాడ్మింటన్ పోటీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన మహిళలు ఇప్పుడు ప్రపంచకప్‌లోనూ తమ సత్తా చాటారు అని గోయల్ అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో ఇప్పుడు బేటీ ఖేలియో అన్న సరికొత్త నినాదానాకి గోయల్ తెరలేపారు.

త్వరలో అండర్-17 ఫిఫా ప్రపంచకప్‌లోనూ భారత ఫుట్‌బాల్ జట్టు రాణించాలని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు ప్రోత్సాహం, సాయం చేసేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని గోయల్ ఈ సందర్భంగా ఆటగాళ్లకు భరోసా ఇచ్చారు.

# పాఠశాల బస్సుల విస్తృత తనిఖీ

## 16 కేసుల నమోదు .. నాలుగు బస్సుల స్వాధీనం



విజయవాడ: కృష్ణా జిల్లా రవాణాశాఖ బుధవారం ఉదయం విజయవాడ నగరంలో పాఠశాల బస్సులను తనిఖీ చేసింది. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉపరవాణా కమిషనర్ ఇ.మీరాప్రసాద్ నేతృత్వంలో 10 బృందాలు విజయవాడ నగర పరిధిలోని 10 కూడళ్లలో పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మొత్తం 394 బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 16 బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో 12 బస్సుల్లో అదనంగా విద్యార్థులున్నట్లు గుర్తించారు. మిగిలిన నాలుగు బస్సులు నిబంధనల ఉల్లంఘన జరగటంతో వాటిని సీజ్ చేసి గన్నవరం రవాణాశాఖ కార్యాలయానికి తరలించారు.

### సరకు రవాణా చేస్తున్న బస్సు సీజ్

విజయవాడలో పాఠశాల బస్సులు తనిఖీ చేస్తున్న సమయంలో ఒక ట్రావెల్స్ బస్సుపై సరకులను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. కనకదుర్గమ్మ వారధి వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో సదరు బస్సును పట్టుకుని కేసు నమోదు చేశారు. ట్రావెల్స్ బస్సుల్లో సరకులను రవాణా చేయటం నేరమని అలాంటి బస్సులను సీజ్ చేస్తామని డీటీసీ మీరాప్రసాద్ హెచ్చరించారు.



# బకాయిలన్నీ చెల్లిస్తాం

అమరావతి : జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాగైన వేరుసెనగ పంటను కాపాడాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశం. పాత బకాయిలు ఏమున్నా ఇస్తాం. జల ఫిరంగులన్నీ వ్యవసాయ శాఖ నుంచి స్వాధీనం చేసుకుని, మరమ్మతులు చేయించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్‌లాల్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎంఐ కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో జేడీఏ శ్రీరామ్మూర్తి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమిషనర్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల నుంచి జలఫిరంగుల సామగ్రి తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఎంఐ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. మండలాల వారీగా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఎక్కడ ఎంత పంట ఎండిందన్న సమాచారం ఒక రోజు ముందుగా తెలియజేస్తాం. పొలానికి వెళ్లి తక్షణమే నీరందించాలన్నారు.

# కర్ణాటక మాజీ సీఎం కన్నుమూత



బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎన్.ధరమ్ సింగ్(80) కన్నుమూశారు. కొంతకాలంగా వూపిరితిత్తుల్లో సమస్యతో బాధపడుతున్న ఆయన్ను బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ.. గురువారం ఉదయం 11.54 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ధరమ్ సింగ్‌కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. 2004 నుంచి 2006 వరకు ధరమ్ సింగ్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

# భారత్ తొలి ఇన్నింగ్స్ : 600 ఆలౌట్

## అరంగేట్ర టెస్టులో పాండ్య అర్ధ శతకం

## ధావన్ 190, పుజారా 153



గాలె: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ మొదటి ఇన్నింగ్స్ ముగిసింది. 399/3 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 600 పరుగుల వద్ద ఆలౌటైంది. అరంగేట్ర టెస్టులో హార్దిక్ పాండ్య అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు.

తొలి రోజు ధావన్ (190), పుజారా రాణించడంతో భారత్ 399/3తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఈ ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కి 253 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రెండో రోజు తొలి సెషన్‌లోనే భారత్ పుజారా (153), రహానె (57) వికెట్లను కోల్పోయింది. పుజారా ఔటవ్వడంతో క్రీజులోకి వచ్చిన అశ్విన్ 47 పరుగులతో రాణించి తృటిలో అర్ధశతకాన్ని చేజార్చుకున్నాడు. అశ్విన్‌కు ఇది 50వ టెస్టు. వికెట్ కీపర్ సాహా (16), రవీంద్ర జడేజా (15) ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. వీరి స్థానంలో బ్యాటింగ్‌కి వచ్చిన పాండ్య, మహమ్మద్ షమి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఇద్దరూ కలిసి తొమ్మిదో వికెట్‌కి 62 పరుగులు చేశారు. షమి 30 బంతుల్లో 30 పరుగులు సాధించాడు పాండ్య కూడా ఆచితూచి ఆడుతూ, వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డు వేగాన్ని పెంచాడు. ఈ క్రమంలోనే అర్ధశతకం (50, (5 ఫోర్లు, 3 సిక్సర్లు) సాధించాడు. అరంగేట్ర టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లోనే అర్ధశతకం సాధించిన ఘనతను పాండ్య అందుకున్నాడు. అనంతరం 134వ ఓవర్లో లాహిరు కుమారా వేసిన తొలి బంతిని ఎదుర్కొన్న పాండ్య క్యాచ్ ఇచ్చి మైదానాన్ని వీడాడు. దీంతో 600 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌కి తెరపడింది.

శ్రీలంక ఆటగాడు నువాన్ ప్రదీప్ అత్యధికంగా ఆరు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రదీప్ ఆరు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. గతంలో అతడు నాలుగు వికెట్లను ఆరుసార్లు తీశాడు కానీ ఐదు వికెట్లు, ఆపై తీయడం ఇదే తొలిసారి.

శ్రీలంక గడ్డపై భారత్‌కిది రెండో అత్యధిక స్కోరు. గతంలో 2010లో కొలంబోలో జరిగిన టెస్టు మ్యాచ్‌లో భారత్ 707 పరుగులు చేసింది.






VIJAYABHANU - Vijayawada
Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ★ e-mail: vijayabhanudaily@gmail.com